1st Year
Happy Work Anniversary.

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక

RNI : APTEL / 2023 / 89152

Good for Health
Best for Readers

సంపుటి : 2 సంచిక : 198 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 12 జూన్ 2025 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 02 ISSUE : 198 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thursday 12 June 2025 PAGES : 8 PRICE : 3/-




# మోడీ ఇచ్చారు... చంద్రబాబు ఎగ్గొట్టారు

**పొగాకు వేలం కేంద్రం వద్ద మీడియాతో మాజీ సీఎం వైఎస్ జగన్**

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 11)**

రాష్ట్రంలో రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నా పట్టించుకునే స్థితిలో కూటమి ప్రభుత్వం లేదని, చంద్రబాబు సీఎం కావడం రైతుల పాలిట శాపమని వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పొదిలి పొగాకు బోర్డును సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇవాళ రైతులు నానా అవస్థలు పడుతున్నారు. రైతులను పట్టించుకునే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదు. రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రకాశం జిల్లాలో(పర్చూరు, కొండెపి) ఇటీవలే ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు.

రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవాల్సిన పరిస్థితి. తమా హయాంలో రైతు రాజ్యం నడిచింది. కానీ, కూటమి ప్రభుత్వంలో రైతు నష్టపోతున్నాడు. మా హయాంలో ఖరీఫ్ సీజన్లోనే పెట్టుబడి సాయం అందించాం. చంద్రబాబు వచ్చాక రైతు భరోసా సాయం లేదు. కేంద్రం ఇచ్చే రూ.6 వేలు కాకుండా మరో రూ.20 వేలు ఇస్తామని చంద్రబాబు అన్నారు. గతేడాది రైతు భరోసా రూ.20 ఎగ్గొట్టారు. మోదీ ఇచ్చారు.. చంద్రబాబు ఎగ్గొట్టారన్నారు. -మిగతా 2లో



**మహిళలు, పోలీసులపై రాళ్ల దాడి చేసిన**

# దుర్మార్గులను కఠినంగా శిక్షిస్తామన్న మంత్రి నారా లోకేష్

**జగన్ మొన్న తెనాలి గంజాయి బ్యాచ్ రౌడీషీటర్లకు ఓదార్పు యాత్ర చేశారు**
**ఇప్పుడేమో తల్లిలా గౌరవించాల్సిన మహిళలను వేశ్యలని**
**మాట్లాడిన వారికి మద్దతుగా నిలుస్తున్నారని ఫైర్**



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 11)**

పొదిలిలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలు, పోలీసులపై వైసీపీ సైకోల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మహిళలు, పోలీసులపై రాళ్ల దాడి చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షిస్తామన్నారు. జగన్ మొన్న తెనాలి గంజాయి బ్యాచ్ రౌడీషీటర్లకు ఓదార్పు యాత్ర చేశారు. ఇప్పుడేమో తల్లిలా గౌరవించాల్సిన మహిళలను వేశ్యలని మాట్లాడిన వారికి మద్దతుగా నిలుస్తున్నారని లోకేష్ విమర్శించారు. సొంత తల్లిని, చెల్లిని మెడ పట్టి బయటకు గెంటేశారని దుయ్యబట్టారు. తల్లిని, చెల్లిని కోర్టుకు ఈడ్చారని, సొంత చెల్లి పుట్టుక పై దుష్ప్రచారం చేయించిన మీరు మహిళలను గౌరవిస్తారని ఆశించడం అత్యాశేనని లోకేష్ అన్నారు. మహిళలపై వైసీపీ నేతలు ఒళ్లు బలిసి మాట్లాడుతున్న మాటలకు, పొదిలిలో మహిళలపై వైసీపీ చేసిన దాడికి జగన్ బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## కాంగ్రెస్ పార్టీని చీల్చేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతోంది

ఖర్గే సంచలన ఆరోపణలు
కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై
కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే తీవ్ర విమర్శలు
మోదీ 11 ఏళ్ల పాలనలో
33 తప్పులు చేశారని ఖర్గే వ్యాఖ్య
అబద్ధాలతో దేశ యువతను
ప్రధాని మోసం చేశారని ధ్వజం
ప్రతిపక్షానికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వకపోవడంపై
తీవ్ర అసంతృప్తి

4



## ప్రధానితో భేటీ కావాలంటే ఆర్టీపీసీఆర్ టెస్టు తప్పనిసరి

**(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూన్ 11)**

దేశంలో కొవిడ్ వ్యాప్తి రోజురోజుకీ పెరుగుతోంది. తాజాగా ఈ వైరస్ బారిన పడినవారి సంఖ్య 7వేలు దాటింది. దేశంలో కేసులు పెరుగుతుండడంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ సూచించింది. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీని కలిసే మంత్రులు, ప్రభుత్వ అధికారులు, ఇతర ప్రముఖులు తప్పనిసరిగా ఆర్టీపీసీఆర్ పరీక్ష చేయించుకోవాలని పీఎంఓ సూచించినట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.



కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ బుధవారం విడుదల చేసిన అధికారిక తాజా డేటా ప్రకారం.. గత 24 గంటల్లో దేశంలో 306 కొత్త కేసులు నమోదవడంతో ప్రస్తుతం యాక్టివ్ కేసుల సంఖ్య 7,121లకు చేరింది. దేశంలో కొవిడ్ మృతుల సంఖ్య 74కు పెరిగింది. కేరళలో అత్యధికంగా 2,223 యాక్టివ్ కేసులు ఉండగా.. గుజరాత్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ తర్వాతి స్థానాల్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. కరోనా కొత్త వేరియంట్లపై భయాందోళనలు అవసరం లేదని.. ఇన్ఫెక్షన్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

**రాష్ట్రాల వారీగా కొవిడ్ కేసులు ఇలా..**

డేటాబోర్డులో వెల్లడించిన సమాచారం ప్రకారం.. దేశంలో మొత్తం 7,121 కేసులు ఉండగా.. కేరళలో అత్యధికంగా 2,223 కేసులు నమోదయ్యాయి. గుజరాత్ 1,223, ఢిల్లీ 757, పశ్చిమబెంగాల్ 747, మహారాష్ట్ర 615, కర్ణాటక 459, ఉత్తరప్రదేశ్ 229, తమిళనాడు 204, రాజస్థాన్ 138, -మిగతా 2లో

## సూపర్ సిక్స్‌లో మరో ముఖ్యమైన హామీకి చంద్రబాబు గ్రీన్ సిగ్నల్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 11)**

సూపర్ సిక్స్‌లో మరో ముఖ్యమైన హామీని అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వానికి ఏడాదైన సందర్భంగా గురువారం తల్లికి వందనం పథకం నిధులు విడుదల చేయాలని నిర్ణయించారు. 67.27 లక్షల మంది తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.8,745 కోట్లు జమ చేయనుంది. ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లి వందనం ఇస్తామని ప్రభుత్వం తెలిపింది. ఈ ఏడాది ఒకటో తరగతి, ఇంటర్‌లో చేరిన వారికీ తల్లికి వందనం అమలు చేయనున్నారు. అడ్మిషన్లు పూర్తయ్యి డేటా అందుబాటులోకి రాగానే నిధులు జమ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. ఈమేరకు విధి విధానాలు ఖరారు చేస్తూ ఇవాళ జీవో విడుదల చేయనుంది. సూపర్ సిక్స్ హామీల్లో ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్, మెగా డీఎస్సీ, దీపం-2 పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది.

**తల్లులకు అభినందనలు.. విద్యార్థులకు శుభాకాంక్షలు: మంత్రి లోకేశ్**

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా తల్లికి వందనం అమలుకు శ్రీకారం చుట్టామని ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈ సందర్భంగా తల్లులకు అభినందనలు.. విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. బడికి వెళ్లే పిల్లలందరికీ తల్లికి వందనం అందుతుందన్నారు. ఇప్పటికే పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, దీపం-2 అమలు చేశామని పేర్కొన్నారు.

## పాక్‌కు షాక్: జమ్మూకశ్మీర్‌లో చేపట్టే ప్రాజెక్టుల్లో నిల్వ సామర్థ్యం పెంపు..

**(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూన్ 11)**

జమ్మూకశ్మీర్‌లో హైడ్రో పవర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెంపుపై ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని కేంద్ర విద్యుత్తుశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు. నిర్మాణ ప్రతిపాదనల్లో ఉన్న ప్రాజెక్టుల్లో అంతకుమించి ఇప్పుడు ఎటువంటి మార్పులు చేయడం లేదని చెప్పారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాన్ని వెల్లడించారు. "సింధు జలాల ఒప్పందం విషయానికి వస్తే.. ప్రతిపాదనల్లో ఉన్న ప్రాజెక్టుల్లో ఎటువంటి మార్పులు లేవు. ఎందుకంటే వీటి సాంకేతిక అంశాలు ఇప్పటికే నిర్ణయించేశారు. కొన్ని ప్రాజెక్టులు ప్రారంభ దశలోనే ఉన్నాయి. వాటిల్లో విద్యుత్తు ఉత్పత్తిని -మిగతా 2లో



## 'ఆపరేషన్ సిందూర్' దెబ్బ.. రక్షణ బడ్జెట్‌ను అమాంతం పెంచేసిన పాక్!

**పాకిస్థాన్ రక్షణ బడ్జెట్‌లో 20 శాతం పెరుగుదల**
**2025-26 ఆర్థిక సంవత్సరానికి 2.55 లక్షల కోట్ల పాక్ రూపాయల కేటాయింపు**
**భారత్‌తో పెరిగిన ఉద్రిక్తతలు, అంతర్గత భద్రతా వైఫల్యాల ప్రభావం**
**'ఆపరేషన్ సిందూర్' ఘటనతో సైన్యంపై పెరిగిన ఒత్తిడి**

**(షణ్ముఖ వెలుగు,ఢిలీ,జూన్ 11)**

భారత్‌తో సరిహద్దు ఉద్రిక్తతలు తీవ్రస్థాయిలో కొనసాగుతున్న వేళ, అంతర్గతంగా భద్రతా వైఫల్యాలపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో పాకిస్థాన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రక్షణ బడ్జెట్‌ను ఏకంగా 20 శాతం పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు పాక్ ఆర్థిక -మిగతా 2లో



మొదటిపేజీ తరువాయి

# మోడీ ఇచ్చారు.... చంద్రబాబు ఎగ్గొట్టారు

**మా హయాం.. రైతులకు స్వర్ణయుగం**

మా ప్రభుత్వంలో రైతుకు కనీస మద్దతు ధర ఇచ్చాం. ప్రతీ రైతుకు అదనంగా రూ.10 వేలు ఇచ్చేవాళ్లం. పారదర్శకంగా ఉచిత బీమా అందించాం. మా హయాంలో రైతుకు వెన్నెముకగా ఆర్బీకే(రైతు భరోసా కేంద్రాలు)లు నిలిచాయి. రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేశాం. మార్కెట్లో పోటీ పెరిగి రైతుకు గిట్టుబాటు ధర వచ్చేది. కేంద్రం ప్రకటించిన పంటలకే కాకుండా.. రాష్ట్రం నుంచి అనేక పంటలకు కనీస మద్దతు ధర ఇచ్చాం. ఏ పంటకైనా గిట్టుబాటు ధర లేకుంటే ఆర్బీకే ద్వారా ఇచ్చేవాళ్లం. ఐదెకరాల మిర్చి రైతులకు రూ.4లక్షల పరిహారం ఇచ్చిన ఘనత మాది. మా హయాంలో రైతులకు సువర్ణ యుగం. ఏ రకంగానూ రైతును నష్టపోనివ్వలేదు.

**కూటమి పాలనలో అధ్వానం**

కూటమి వచ్చాక ఉచిత బీమా ఎత్తేశారు. దళారీలు లేకుండా ఇప్పుడు పంట కొనే పరిస్థితి లేదు. ఈ క్రాప్ వ్యవస్థను నీరుగార్చారు. కూటమి వచ్చాక ఇన్పుట్ సబ్సీడీని గాలికొదిలేశారు. కల్తీ ఎరువులు, కల్తీ విత్తనాలతో నష్టపోతున్నారు. 2023- 24లో కేజీ పొగాకు రూ.366కి అమ్ముడుపోయేది. ఇప్పుడు రూ.240 కూడా అమ్ముడుపోవడం లేదు. క్వింటా పొగాకు రూ.24 వేలు తగ్గకుండా రైతు అమ్ముకున్నాడు. 220 మిలియన్ టన్నులు ప్రొక్యూర్ చేయాల్సి ఉంటే.. కేవలం 40 మిలియన్ టన్నులే ప్రొక్యూర్ చేశారు. హైగ్రేడ్ పొగాకుకు కూడా ఈరోజు గిట్టుబాటు ధర దక్కడం లేదు. పొగాకు బ్లాక్ బర్లీ రైతు ఎకరాకు రూ.80వేలు నష్టపోతున్నాడు. చంద్రబాబు సీఎం కావడం రైతులకు శాపం. మా హయాంలో మార్కెట్ను రంగంలోకి దించాం. మార్కెఫెడ్ రావడంతో మార్కెట్లో పోటీ పెరిగింది. మీరెందుకు ఆ పని చేయలేదు?. అసలు ప్రభుత్వం ఎందుకు మార్కెఫెడ్ వేలంలో పాల్గొనలేదు. బాబు, దళారుల మధ్య సంబంధాలతో రైతులు నష్టపోతున్నారని అన్నారు. ఈ మీడియా సమావేశంలో వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైసీపీ ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు, ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వై వి సుబ్బారెడ్డి, వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుండూరి రవిబాబు, మాజీ పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి(బన్నీ), జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్సీ తూమాటి మాధవ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ప్రధానితో భేటీ కావాలంటే ఆర్టీపీసీఆర్ టెస్టు తప్పనిసరి

హరియాణా 125, ఆంధ్రప్రదేశ్ 72, మధ్యప్రదేశ్ 65, మహారాష్ట్ర 615, ఛత్తీస్‌గఢ్, 48, బిహార్ 47, ఒడిశా 41, సిక్కిం, పంజాబ్ ఒక్కో రాష్ట్రంలో 33 చొప్పున కేసులు, తెలంగాణ 11, పుదుచ్చేరి, ఝార్ఖండ్‌లలో చెరో 10 కేసులు, జమ్మూకశ్మీర్ 9, అస్సాం, గోవాల్లో 6, చండీగఢ్, ఉత్తరాఖండ్ 3, హిమాచల్ ప్రదేశ్ 2, మణిపుర్, త్రిపుర చెరో కేసు నమోదయ్యాయి.

# పాక్‌కు షాక్: జమ్మూకశ్మీర్‌లో చేపట్టే ప్రాజెక్టుల్లో నిల్వ సామర్థ్యం పెంపు..

ఎక్కువగా చేసేందుకు మరింత నీటినిల్వ సామర్థ్యం పెంచవచ్చు" అని తెలిపారు. ఏప్రిల్ 22న పహల్గాం ఉగ్రదాడి తర్వాత కేంద్ర ప్రభుత్వం పాక్‌తో ఉన్న సింధుజలాల ఒప్పందాన్ని నిలిపివేసింది. వాస్తవానికి ఈ ఒప్పందం కారణంగానే ఇన్నాళ్లు సింధు, దాని ఉప నదులపై భారత్ హైడ్రోఎలక్ట్రిక్ ప్లాంట్ల నిర్మాణం కష్టంగా మారింది. దీంతోపాటు నీటినిల్వ సామర్థ్యం పెంచడం కూడా ఇబ్బందికరంగా మారింది. కానీ, ఇప్పుడు ఒప్పందాన్ని నిలిపివేయడంతో.. కొత్త ప్రాజెక్టులతో పాటు నీటి నిల్వను కూడా పెంచే అవకాశం లభించింది. ప్రస్తుతం సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ జమ్మూకశ్మీర్‌లో నాలుగు హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులను ఆమోదించింది. కానీ, ఇవి ఇంకా నిర్మాణ పనులను ప్రారంభించాల్సి ఉంది. వీటిల్లో సింధుపై న్యూ గందర్బాల్ ప్రాజెక్టు, చీనాబ్‌పై కిర్తాయ్-2, సవల్‌కోట్, జీలంపై ఉరి-1,2 ప్రాజెక్టులు సిద్ధమవుతున్నాయి.సింధు, దాని ఉపనదుల జలాలను పంచుకోవడానికి ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఒప్పందం కుదిరింది. దీనిపై 1960 సెప్టెంబరులో నాటి భారత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ, పాకిస్థాన్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ సంతకాలు చేశారు. ఒప్పందం ప్రకారం సింధు ఉప నదుల్లో తూర్పున పారే రావి, బియాస్, సట్లెజ్ నదులపై భారతదేశానికి హక్కులు లభించాయి. వీటి సగటు వార్షిక ప్రవాహం 33 మిలియన్ ఎకరాల అడుగులు (ఎమ్ఏఎఫ్)గా ఉంది. సింధు నదితోపాటు దాని పశ్చిమ ఉపనదులైన జీలం, చీనాబ్‌లపై పాకిస్థాన్‌కు హక్కులు దక్కాయి. వీటి సామర్థ్యం 135 ఎంఏఎఫ్‌గా ఉంది. ఈ నదీ జలాల వినియోగ సమాచారాన్ని పంచుకోవడానికి ఒప్పందం కింద ఓ సహకార యంత్రాంగాన్ని నెలకొల్పారు.

# 'ఆపరేషన్ సిందూర్' దెబ్బ.. రక్షణ బడ్జెట్‌ను అమాంతం పెంచేసిన పాక్!

మంత్రి మహమ్మద్ ఔరంగజేబ్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో సైనిక వ్యయానికి పెద్దపీట వేశారు.

తాజా బడ్జెట్ ప్రతిపాదనల ప్రకారం, రక్షణ రంగానికి 2.55 లక్షల కోట్ల పాకిస్థానీ రూపాయలు (సుమారు 9 బిలియన్ డాలర్లు) కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఈ కేటాయింపులు 2.12 లక్షల కోట్ల రూపాయలు (సుమారు 7.44 బిలియన్ డాలర్లు)గా ఉన్నాయి. ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన విషయం తెలిసిందే. భారత పాలిత కశ్మీర్‌లో 26 మంది హిందూ యాత్రికుల మృతికి కారణమైన ఉగ్రదాడి అనంతరం, రెండు అణ్వస్త్ర దేశాల మధ్య క్షిపణులు, డ్రోన్ల దాడులు చోటుచేసుకున్నాయి. మే ఆరంభంలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, సరిహద్దుల్లో ఉద్రిక్త వాతావరణం ఇంకా చల్లారలేదు.ఈ నేపథ్యంలో దేశ రక్షణకే తమ ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని ఆర్థిక మంత్రి మహమ్మద్ ఔరంగజేబ్ స్పష్టం చేశారు. అయితే, మొత్తం ప్రజా వ్యయాన్ని 7 శాతం తగ్గించి 17.57 లక్షల కోట్ల రూపాయలకు (సుమారు 62 బిలియన్ డాలర్లు) పరిమితం చేసినప్పటికీ, రక్షణ వ్యయాన్ని గణనీయంగా పెంచడం గమనార్హం. పర్యావరణ మార్పుల వల్ల తీవ్రంగా నష్టపోతున్న పాకిస్థాన్, విద్య, వ్యవసాయం, వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్ట నివారణ చర్యల కంటే రక్షణ రంగానికే అధిక నిధులు కేటాయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఈ వ్యయ పెంపునకు గల వ్యూహాత్మక కారణాలను వివరించారు. "సాంప్రదాయ యుద్ధంలో భారత్‌ను ఓడించిన తర్వాత, ఇప్పుడు ఆర్థిక రంగంలో కూడా మనం వారిని అధిగమించాలి. కేవలం సైనికంగానే కాకుండా, ఆర్థికంగా కూడా పాకిస్థాన్ ముందుకు సాగాలి" అని ఆయన వ్యాఖ్యానించారు.

ఇటీవలి సంక్షోభాల సమయంలో, ముఖ్యంగా 'ఆపరేషన్ సిందూర్' ఘటనలో పాకిస్థాన్ సైనిక దళాల సన్నద్ధత, ప్రతిస్పందన సామర్థ్యంలోని లోపాలు బహిర్గతమయ్యాయని తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సైనిక సామర్థ్యాన్ని పునరుద్ధరించుకోవడానికి, దేశీయంగా సాయుధ బలగాలపై విశ్వాసాన్ని పెంపొందించుకోవడానికి ఈ బడ్జెట్ పెంపు ఒక రక్షణ వ్యూహంగా కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

అయితే, రక్షణ రంగానికి ఇంత భారీ మొత్తంలో నిధులు కేటాయించడంపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే బలహీనంగా ఉన్న ఆర్థిక వ్యవస్థపై ఈ నిర్ణయం మరింత భారం మోపుతుందని, కీలకమైన పౌర రంగాల నుంచి నిధులను పక్కదారి పట్టిస్తుందని వారు ఆరోపిస్తున్నారు.

# కాంగ్రెస్ పార్టీని చీల్చేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర పన్నుతోంది

**(షణ్ముఖ వెలుగు, అమరావతి, జూన్ 11)**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీని విడగొట్టేందుకు మోదీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని, ఇందుకోసం అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ప్రధాని మోదీ పదకొండేళ్ల పాలనలో దేశ యువతను తప్పుదోవ పట్టించారని, అనేక తప్పులు చేశారని దుయ్యబట్టారు.

వాల్మీకి కార్పొరేషన్ కుంభకోణం ఆరోపణలకు సంబంధించి ముగ్గురు కాంగ్రెస్ ఎంపీల ఇళ్లపై ఈడీ దాడులు చేయడంపై ఆయన కర్ణాటకలోని కల్బురిగి జిల్లాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తీవ్రంగా స్పందించారు. "కాంగ్రెస్ పార్టీని బలహీనపరిచేందుకే మోదీ ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతోంది. మా ఎంపీలపై ఆరోపణలు మోపి, దాడులు చేయిస్తున్నారు. అయితే, కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి చీలిక రాదు, మేమంతా ఐక్యంగా ఉన్నాం" అని ఖర్గే స్పష్టం చేశారు.

**11 ఏళ్ల పాలనలో 33 తప్పులు**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనపై ఖర్గే తీవ్ర విమర్శలు గుప్పించారు. "మోదీ పదకొండేళ్ల పాలనలో ఎన్నో తప్పులు జరిగాయి. లెక్కలేనన్ని అబద్ధాలు చెప్పి దేశ యువతను మోసం చేశారు. ఈ సుదీర్ఘ కాలంలో ఆయన ప్రభుత్వం ఏకంగా 33 తప్పులు చేసింది. నా రాజకీయ జీవితంలో ఇలా అబద్ధాలు చెప్పి, యువతను, పేదలను మోసగించి ఓట్లు దండుకునే ప్రధానమంత్రిని ఎప్పుడూ చూడలేదు. ఇప్పుడు మోదీ రూపంలో చూస్తున్నాను. ఆయనకు ప్రజల బాగోగుల గురించి ఏమాత్రం పట్టదు" అని ఖర్గే ఆరోపించారు.

**ప్రజాస్వామ్యంపై నమ్మకం లేని ప్రధాని**

లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవిని ఇప్పటికీ ఖాళీగా ఉంచడాన్ని కూడా ఖర్గే తప్పుబట్టారు. "గతంలో యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షాలకు కేటాయించాలని మేమే ప్రతిపాదన చేశాం. కానీ, మోదీ సర్కార్ మాత్రం ఆ సంప్రదాయాన్ని గాలికొదిలేసింది. ప్రతిపక్షానికి చిన్న పదవి కూడా ఇచ్చేందుకు వెనుకాడుతోంది. ఈ విషయంపై ప్రధాని మోదీకి ఎన్నోసార్లు లేఖలు రాశాను. అయినా ఆయన ఏమాత్రం పట్టించుకోలేదు. దీన్నిబట్టి చూస్తే, ఆయనకు ప్రజాస్వామ్య విలువలపై ఏమాత్రం విశ్వాసం లేదని స్పష్టంగా అర్థమవుతోంది" అని మల్లికార్జున ఖర్గే విమర్శించారు.

# 104 సంచార వైద్య వాహనాల్లో డ్రైవర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానం

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 11)**

జిల్లాలోని 104 సంచార వైద్య వాహనాల్లో డ్రైవర్లు, డాటా ఎంట్రీ ఆపరేటర్లు నియామకాల కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు 104 సేవల సర్వీస్ ప్రొవైడర్ భవ్య హెచ్‌ఆర్ మేనేజర్ తెలిపారు. డాటా ఎంట్రీ ఆపరేటర్ కొరకు డిగ్రీ పూర్తయి, కంప్యూటర్ కోర్సు పూర్తి చేసి ఉండవలెనని, డ్రైవర్ నియామకంకు పదో తరగతి పాసై, హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు' బీహెచ్‌ఎస్పీఎల్.ఇన్,సీఏఆర్ఈఈఆర్ఎస్ తమ పూర్తి వివరాలు నమోదు చేసుకుని, తేదీ 12-06-2025 న ఒంగోలు ఓల్డ్ రిమ్స్ వెనుక ఉన్న 108-104 కార్యాలయంలో తమ దరఖాస్తులు, ఒరిజినల్ సర్టిఫికెట్స్, జిరాక్స్ కాపీలతో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు.

# జగన్ పోరుబాటకు పార్టీ శ్రేణులతో తరలివెళ్లిన ఎమ్మెల్యే తాటిపర్తి




**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జూన్ 11)**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రజలకు మద్దతుగా పొదిలిలో నిర్వహించనున్న పోరుబాటకు యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం పొదిలికి బయలుదేరారు. ముందుగా పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు వద్ద నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులతో సమావేశమై, అందరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పెద్ద ఎత్తున నాయకులు, కార్య కర్తలు, పాల్గొని అభిమానులు పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. అనంతరం భారీ ర్యాలీగా 100 వాహనాలతో పార్టీ శ్రేణులతో కలసి వెళ్ళినారు. ఈ కార్యక్రమంలో ఐదు మండలాల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీ లు, సర్పంచులు నాయకులు కార్యకర్తలు అభిమానులు తరలి వచ్చారు.



# ప్రశాంతంగా ఉన్న ఈ ప్రాంతాన్ని కలుషితం చేయడమే జగన్ పొదిలి పర్యటన ఉద్దేశం

**మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి**



**(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, జూన్ 11)**



కొనకనమిట్ల మండలంలోని కొనకనమిట్ల గ్రామంలో రాజధాని మహిళ రైతులపై జగన్ సొంత మీడియా సాక్షి ఛానల్ రిపోర్టర్‌లు అయిన కొమినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు చేసిన సభ్య సమాజం వినలేని వ్యాఖ్యలులను నిరసిస్తూ మహిళలు భారీ ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన ర్యాలీ కొనకనమిట్ల బస్టాండ్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు నిర్వహించారు. ఈ నిరసన ర్యాలీకి సంఘీభావంగా మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విచ్చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొంత వాతావరణం ప్రతికూల పరిస్థితుల్లో రైతులు ఈ ఏడాది పొగాకు ఇచ్చిన దానికంటే ఎక్కువ పండించారని అంతర్జాతీయ మార్కెట్ దృష్ట్యా కొంత ధరలు పతనమైన మాట వాస్తవమేనని, అది తెలుసుకున్న తాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పొదిలి పొగాకు బోర్డు వెళ్లి కంపెనీ యాజమాన్యాలతో మాట్లాడి కొనుగోలులో వేగం పెంచానని అన్నారు. ప్రశాంతంగా ఉన్న ఈ ప్రాంతాన్ని కలుషితం చేయడం కోసమే జగన్ ఈరోజు పొదిలికి విచ్చేస్తున్నారని అన్నారు. ఈ మధ్య జగన్ సొంతం మీడియా సాక్షి ఛానల్‌లో అమరావతి మహిళా రైతులను వేశ్యలని వ్యాఖ్యానించారని దీనికి నిరసనగా పొదిలిలో మహిళలు జగన్ పర్యటనలో నల్ల బెలూన్‌లు ఎగరవేసి తమ నిరసన తెలిపారని, కానీ కాన్వాయ్‌లో రాళ్లతో వచ్చిన వైసిపి నాయకులు మహిళలపై రాళ్ల దాడి చేశారని ఇది అమానుషమన్నారు. చివరకు మహిళలకు కూడా గాయాలయ్యాయి అని వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. జగన్ రాష్ట్రాన్ని దివాలా తీయించారని, అయినా కూడా సంక్షేమ పథకాల విషయంలో తాము వెనక్కి తగ్గబోమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మూరబోయిన బాబురావు యాదవ్, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామసాని రామిరెడ్డి, గొట్లగట్టు సర్పంచ్ పెరికె సుఖదేవ్ (బూన్), మాజీ మండల పార్టీ అధ్యక్షులు తాతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మువ్వ కాటం రాజు, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# లో గ్రేడ్ పొగాకును కొనుగోలు చేయాలి

**రైతుకు నష్టం వస్తే... ప్రభుత్వం చూస్తూ ఉరుకోదు**

**ఈ నెల 15, 16 నుంచి మార్క్ ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు**

**మార్కెటింగ్ ఇబ్బందుల దృష్ట్యా వ్యాపారులూ సహకరించాలి**

**రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 11)**




హై, మీడియం గ్రేడ్‌తో పాటు లో గ్రేడ్ పొగాకును కూడా రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. త్రోవగుంటలోని..వేలం కేంద్రాన్ని సహచర మంత్రి డోలాతో కలిసి పరిశీలించిన ఆయన... పొగాకు కొనుగోలుకు సంబంధించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. గడిచిన రెండేళ్లుగా పొగాకు కొనుగోలుతో వ్యాపారులు, కంపెనీ ప్రతినిధులు లాభాలు పొందారని గుర్తు చేశారు. అధిక ఉత్పత్తితో ప్రస్తుతం ఉన్న తక్కువ డిమాండ్ దృష్ట్యా రైతుల నుంచి పూర్తి స్థాయిలో పొగాకు కొనుగోళ్లకు బయ్యర్లు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పొగాకు రైతులకు నష్టం వస్తుంటే కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు. ఉత్పత్తి ఎక్కువ అవడం వల్ల వచ్చిన మార్కెటింగ్ ఇబ్బందులను అధిగమించి... వ్యాపారులు కూడా పొగాకు రైతులకు సహకరిచాలని కోరారు. దీనిపై అవసరం అయితే పొగాకు బోర్డు కూడా ముందుకు వచ్చి.. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని మంత్రి గొట్టిపాటి సూచించారు. బ్లాక్ బెర్లీ రకం పొగాకును కూడా కొనుగోలులో చిన్న చిన్న సమస్యలు ఉన్నా పరిష్కరించామని చెప్పిన మంత్రి.. బ్లాక్ బెర్లీ పొగాకును కూడా వెంటనే కొనుగోలు చేయాలని వ్యాపారులకు చెప్పారు.

**రైతులకు ముఖ్యమంత్రి బాసట....**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని చెప్పిన మంత్రి గొట్టిపాటి.., మామిడి సీజన్ లో రైతులకు సమస్య ఉత్పన్నం అయితే స్వయంగా సీఎం చంద్రబాబు రంగంలోకి దిగి సమస్య పరిష్కరించిన విషయాన్నిగుర్తు చేశారు. ప్రస్తుతం బ్లాక్ బెర్లీ పొగాకు విషయంలోనూ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ నెల 15, 16 తేదీల నుంచి మార్క్ ఫెడ్ ద్వారా... బ్లాక్ బెర్లీ రకం నల్ల పొగాకు కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. గతంలోనూ ఆయల్ పామ్, కోకో పంటల రైతులకు సమస్యలు ఎదురైనా ప్రభుత్వం వెంటనే పరిష్కరించిందని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా అన్ని చర్యలూ చేపడుతున్నామన్నారు. ఏవైనా చిన్న చిన్న సమస్యలు వచ్చినా... వాటిని వెంటనే పరిష్కరించి ముందుకు వెళ్తామని గొట్టిపాటి స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

షణ్ముఖ వెలుగు
ePaper
www.shanmukhavelugu.com
3 | 12.06.25
గురువారం



## మార్కాపురం నియోజకవర్గానికి బ్లాక్ డే

### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 11)

మార్కాపురం నియోజకవర్గానికి బుధవారం బ్లాక్ డే అని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. బుధవారం పొదిలి పట్టణంలో (తరువాయి 4లో...)

షణ్ముఖ
వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
ప్రకాశం

# రైతు ఖర్మకాలి చంద్రబాబు సీఎం అయ్యారు



మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలి
రైతు భరోసా లేదు
220 టన్నులకు గాను 40 టన్నుల పొగాకు మాత్రమే కొనుగోలు
రైతుకు ఎకరాకు రూ.80 వేలు నష్టం
తమ ప్రభుత్వంలో ఉచిత పంటల భీమాతో
రూ.7,800 కోట్లు ఇన్సురెన్సు ద్వారా రైతులకు ఇప్పించాం
మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ సీపీ అధినేత వైఎస్ జగన్
జనసంద్రమైన పొదిలి



(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జూన్ 11)

రాష్ట్రంలో రైతుల ఖర్మ కాలి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యారని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగం తిరోగమనంలో కొనసాగుతోందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆక్షేపించారు. చంద్రబాబు సీఎం కావడంతో మళ్లీ రైతుల ఆత్మహత్యలు మొదలయ్యాయన్న ఆయన, ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇద్దరు పొగాకు రైతులు బలవన్మరణానికి పాల్పడ్డారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే పొగాకు రైతులను ఆదుకోవాలని, వారికి గిట్టుబాటు ధర వచ్చేలా, మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే పంటల కొనుగోలుకు శ్రీకారం చుట్టకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ప్రకాశం జిల్లా పొదిలి పొగాకు బోర్డు వద్ద మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వాన్ని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో ఈ రోజు రైతులు పడుతున్న అవస్థలు ఎలా ఉన్నాయంటే.. రైతులను ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితి లేదు. దీంతో రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారు. ఈ సీజన్ లోనే ఉమ్మడి జిల్లాలో ఇద్దరు పొగాకు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. పర్చూరులో ఒక రైతు, గడిచిన శుక్రవారం కొండపిలో మరో రైతు ఆత్మహత్య చేసుకున్నారు. రాష్ట్రంలో ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసినా, కనీస మద్దతు ధర కంటే రూ.300 తక్కువ రైతులకు చెల్లించారు. వరి, మిరప, పత్తి, జొన్న, కందులు, పెసలు, రాగులు, మొక్కజొన్న, కోకో, వేరుశనగ, చీనీ, పొగాకు ఇలా ఏ పంట తీసుకున్నా రైతన్నకు రాష్ట్రంలో గిట్టుబాటు ధర రాని పరిస్థితి కనిపిస్తోంది.

**రైతు భరోసా లేదు :**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కింద ఇచ్చిన పెట్టుబడి సాయం చంద్రబాబు వచ్చిన తర్వాత ఆగిపోయింది. ఈ ఏడాది మోదీ ఇవ్వాల్సిన రూ.6 వేలు ఇచ్చేసినా, చంద్రబాబు ఇవ్వాల్సింది మాత్రం ఎగరగొట్టారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఏ సీజన్లో జరిగిన నష్టాన్ని ఆ సీజన్ ముగిసే నాటికి ఇన్‌పుట్ సబ్సిడీగా ఇచ్చే సాంప్రదాయం ఉండేది. ఈరోజు ఆ ప్రక్రియను గాలికి వదిలేశారు. రైతులు ఎలా నష్టపోయినా, ప్రభుత్వ సాయం మాత్రం అందడం లేదు. అదే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పంట వేసిన తర్వాత, పంట నష్టపోతామన్న భయం రైతులకు లేకుండా, ప్రతి పంటకు ఉచిత పంటల బీమా అమలు చేశాం. ప్రతి ఎకరాను ఈ-క్రాప్ చేసి, ఆర్బీకేల ద్వారా ఉచిత పంటల బీమా అమలు చేస్తే, చంద్రబాబు ప్రభుత్వం ఆ ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కీలకంగా అమలు చేసిన పంటల ఈ-క్రాప్ వ్యవస్థను పూర్తిగా నీరుగార్చారు. దళారులు లేకుండా పంటలు కొనుగోలు చేసే ఆర్బీకే వ్యవస్థను కూడా టీడీపీ కూటమి ప్రభుత్వం నీరుగార్చింది. మా ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా, ఆర్బీకే వ్యవస్థ ద్వారా దళారీలకు తావు లేకుండా చేసి, రైతులకు కనీస మద్దతు ధర అందించాం. అంతే కాకుండా జీఎల్‌టీ (గన్నీ బ్యాగులు, లేబర్, రవాణా చార్జీలు) కింద ప్రతి రైతుకు ఎకరాకు రూ.10 వేలు ఇచ్చాం. అదే ఈరోజు రైతుకు గిట్టుబాటు ధరలు రాని పరిస్థితి. ధాన్యాన్ని రూ.300 తక్కువకు కొనుగోలు చేశారు. రైతు దళారీలకు అమ్ముకున్నాడు. అదే మా ప్రభుత్వ హయాంలో రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి ఐదేళ్ల కాలంలో రూ.7,800 కోట్లు ఖర్చు చేసి, మార్కెట్‌లో పోటీ తత్వాన్ని తెచ్చి, రైతులను ఆదుకున్నాం. కేంద్రం ప్రకటించిన పంటలకే కాకుండా.. మిరప, పసుపు, ఉల్లి, చిరుధాన్యాలు, అరటి, బత్తాయి, టమాటో వంటి పంటలకు కూడా కనీస మద్దతు ధర ప్రకటించి, ఆర్బీకేలలో వాటిపై పోస్టర్లు ఏర్పాటు చేసి అక్కడే అగ్రికల్చర్ గ్రాడ్యుయేట్‌ను కూర్చోబెట్టి.. ప్రతి పంట కూడా ఈ-క్రాప్ చేసి.. ఏ పంటకైనా గిట్టుబాటు ధర రాకపోతే.. అక్కడ సీఎం యాప్ ద్వారా వెంటనే ఆ పంటకు సంబంధించిన రేట్లు అప్‌డేట్ చేసేవారు. ఈ రోజు అవన్నీ గాలికెగిరిపోయిన పరిస్థితుల్లో వ్యవసాయం నడుస్తోంది. 2023-24లో కేజీ రూ.360 అంటే క్వింటా రూ.36 వేలకు వర్జీనియా పొగాకు అమ్ముడుపోయింది. లోగ్రేడ్ పొగాకు కూడా రూ.24 వేలకు తగ్గకుండా అమ్ముడుపోయింది. కానీ, ఈరోజు పరిస్థితి ఏమిటనేది మనమే వెళ్లి చూశాం. మామూలుగా ఈ ప్రొక్యూర్‌మెంట్ మార్చిలో మొదలుపెట్టి జూన్ నాటికి పూర్తి చేయాలి. (తరువాయి 4లో...)







## జగన్‌ను జనంలో తిరగనివ్వకూడదనే బాబు సర్కార్ టార్గెట్

- కిరాయి మనుషులతో టీడీపీ నేతలు రాళ్ళు రువ్వించారు
- జెడ్‌ప్లస్ కేటగిరి ఉన్న నేత కాన్వాయికి సమీపంగా అరాచక శక్తులు ఎలా వచ్చాయి?
- పొగాకు రైతుల కోసం వచ్చిన వైఎస్ జగన్‌ను అడ్డుకోవడం సిగ్గుచేటు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి
- మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నేతృత్వంలోనే దాడి కుట్ర
- అర్థరాత్రి 2 గంటల సమయంలో ఎమ్మెల్యే కందుల ఎందుకు తిరిగాడో సమాధానం చెప్పాలి
- మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు



(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జూన్ 11)

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పొదిలి పర్యటనలో తెలుగుదేశం పార్టీ ఉద్దేశపూర్వకంగా హింసకు కుట్ర పన్నిందని దర్శి ఎమ్మెల్యే, జిల్లా వైసీపీ పార్టీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైసీపీ ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా కార్యాలయంలో పార్టీ ముఖ్యనాయకులతో కలిసి వారు మీడియా సమావేశం నిర్వహించారు. టీడీపీ నేతలు కిరాయి మనుషులతో (తరువాయి 4లో...)

## మార్కాపురం మున్సిపాలిటీలో అవిశ్వాసం విజయం

### టిడిపి ఖాతాలో గెలుపు, అభివృద్ధికి కొత్త దిశ
### మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్‌ఛార్జి, జూన్ 11)

మార్కాపురం మున్సిపాలిటీలో రాజకీయంగా కీలకమైన మలుపు తిరిగింది. బుధవారం జరిగిన అవిశ్వాస తీర్మానంలో తెలుగుదేశం పార్టీ గెలుపొందింది. గత కొన్ని నెలలుగా తర్జనభర్జనలు కొనసాగుతున్న ఈ పరిణామానికి బుధవారం తెరపడింది. పాలన పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వైసీపీ పాలనకు వ్యతిరేకంగా నిలిచిన టిడిపి కౌన్సిలర్లు విజయం సాధించి, తమ శక్తిని మరోసారి చాటి చెప్పారు. ఈ విజయం నేపథ్యంలో మార్కాపురంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి.

**ప్రజా తీర్పును ప్రతిబింబించిన తీర్మానం**

**ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి :** ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఈ విజయాన్ని ప్రజాస్వామ్యానికే గెలుపుగా అభివర్ణించారు. (తరువాయి 4లో...)



## వైఎస్ జగన్ పర్యటనలో ఉద్రిక్తత



### టీడీపీ, వైసీపీ వర్గీయులు పరస్పర దాడులు
### లాఠీ ఛార్జి చేసి చెదరగొట్టిన పోలీసులు
### గాయాలపాలైన మహిళలు, పోలీసులు

(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 11)

పొదిలిలో పొగాకు వేలం కేంద్రం సందర్శనకు బుధవారం వచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన పట్టణంలో ఉద్రిక్తతకు దారితీసింది. హెలిప్యాడ్ నుంచి కారులో బయలుదేరిన ఆయనకు రథం రోడ్డులో తెదేపా రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ ఇంటి సమీపంలో, పాత పోస్టాఫీసు వీధి వద్ద మహిళలు, తెదేపా నాయకులు నల్ల బెలూన్లు, ప్లకార్డులతో స్వాగతం పలికారు. అమరావతి మహిళలను అవమానించే విధంగా మాట్లాడిన సీనియర్ పాత్రికేయుల వ్యాఖ్యలకు నిరసనగా ప్లకార్డులు ప్రదర్శించారు. పాతపోస్టాఫీసు వద్ద జగన్ మోహన్‌రెడ్డి కాన్వాయ్ ముందుకు వెళ్లిన తరవాత వైకాపా నాయకులు, (తరువాయి 4లో...)

# రైతు ఖర్మకాలి చంద్రబాబు సీఎం అయ్యారు

ఆ మేరకు ఈ ఏడాది 220 మిలియన్ టన్నుల ప్రొక్యూర్‌మెంట్ చేయాల్సి ఉంటే కేవలం 40 మిలియన్ టన్నులు మాత్రమే చేశారు. హైగ్రేడ్ క్వాలిటీ రూ.240కి కూడా రావడం లేదు. ఈరోజు నేను వచ్చాను కాబట్టి రూ.280కి కొంటున్నారు. ఇంక లోగ్రేడ్ చూస్తే కొనే నాథుడే లేడు. దాన్ని రూ.160 నుంచి రూ.180కి కొంటున్నారు. అది కూడా ధర నచ్చక రైతులు నలభై శాతం స్టాక్ వెనక్కి తీసుకెళ్తున్నారు. అదే మా ప్రభుత్వ హయాంలో ఇదే హైగ్రేడ్ క్వాలిటీ కేజీ రూ.366కు అమ్ముడు పోయింది. అంటే క్వింటా రూ.36 వేలకు పైగా కొన్నారు. ఇప్పుడు జూన్ నెల సగానికి వచ్చి సీజన్ అయిపోతున్నా 220 మిలియన్ టన్నులు కొనాల్సి ఉంటే, కొనుగోలు చేసింది కేవలం 40 మిలియన్ టన్నులు మాత్రమే. పక్కనే ఉన్న కర్నాటకలో కేజీ రూ.360కి కొనుగోలు చేస్తే మన రాష్ట్రంలో రైతులకు కనీసం యావరేజ్ రేటు రూ.200 కూడా దక్కడం లేదంటే, వారు ఎంత దయనీయ పరిస్థితిలో వ్యవసాయం చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. బ్లాక్ బర్లీ పొగాకు చూస్తే గత ఏడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.15 వేల నుంచి రూ.18 వేల వరకు అమ్ముడుపోతే, ఈరోజు ఆ ధర రూ.6 వేల నుంచి రూ.9 వేలు దాటడం లేదు. దీంతో పొగాకు రైతు ఎకరాకు రూ.80 వేలు నష్టపోతున్న దుస్థితి కనిపిస్తోంది. నాడు 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా మొట్ట మొదటి సారిగా 2020లో పొగాకు వేలం (ఆక్షన్) ప్రక్రియలోకి మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపింది. అలా మార్కెట్‌లో పోటీ పెంచి, ఏకంగా రూ.140 కోట్లు ఖర్చు చేసి కార్టల్‌ను బ్రేక్ చేసి రైతులకు గిట్టుబాటు ధరలు దక్కేలా చూశాం. అదే ఈరోజు రైతు సంక్షేమం గురించి ఆలోచించే పరిస్థితి లేదు. గిట్టుబాటు ధరలు ఇప్పించాలన్న తపన, తాపత్రయం ఎక్కడా లేదు కాబట్టే రైతులు తీవ్రంగా నష్టపోతున్న దుస్థితి రాష్ట్రంలో నెలకొంది. వలం పొగాకు, ఇతర పంటలకే కాకుండా, మిర్చిరైతుకు కూడా రూ.4 లక్షల పరిహారం ఇచ్చిన ఘనత మాదే. ఇదే ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కనిగిరి, గిద్దలూరు, మార్కాపురంలో రైతు ఏనాడూ భయపడేవాడు కాదు. ఏ పంట వేసినా వరదలొచ్చినా, తుఫాన్ వచ్చినా, కరువొచ్చినా.. ఇన్సూరెన్స్ కట్టామా లేదా అనే దిగులు రైతుకు ఉండేది కాదు. వారి తరఫున రాష్ట్ర ప్రభుత్వమే ఉచిత పంటల బీమా డబ్బులు కట్టేది. పంట వేసిన ప్రతి ఎకరా కూడా ఆటోమేటిక్‌గా ఈ–క్రాప్ జరిగేది. ఉచిత పంటల బీమా కింద 54.55 లక్షల రైతులకు ఏకంగా రూ.7,800 కోట్ల ఇన్సూరెన్స్ డబ్బులు ఇప్పించి ఏ రైతు నష్టపోకుండా రైతన్నకు తోడుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలబడింది. మిర్చి పంటకు ఎకరాకు రూ.80 వేల చొప్పున, పప్పు ధాన్యాలకు ఎకరాకు రూ.6 వేల చొప్పున నష్టపరిహారం ఇప్పించాం. అలా 5 ఎకరాలున్న మిర్చి రైతుకు ఏకంగా రూ.4 లక్షల పరిహారం ఇచ్చాం.

రైతులను మోసం చేశారు :

చంద్రబాబు సీఎం అయ్యాక రైతులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. వ్యవసాయం దండగ అనే పరిస్థితికి రాష్ట్రాన్ని తీసుకెళ్లాడు. ఈ సంవత్సరం 20 శాతం పొగాకు ఎక్కువ పండించండి మేము కొనుగోలు చేస్తామని పొగాకు బోర్డు హామీ ఇచ్చింది. గతేడాది బ్యారన్‌కి 35 క్వింటాళ్లకు పర్మిషన్ ఇస్తే ఈసారి 42.5 క్వింటాళ్లకు పర్మిషన్ ఇచ్చి కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతోనే రైతులు సాగు విస్తీర్ణం పెంచారు. పంటను కొంటామని హామీ ఇవ్వడంతో సాగు విస్తీర్ణం 30 శాతం పెరిగింది. కానీ చంద్రబాబు పుణ్యాన ఆర్బీకేలు నిర్వీర్యం అయిన నేపథ్యంలో రైతులు ప్రతిదీ బ్లాకులో కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఒకవైపు రైతుకు పెట్టుబడి ఖర్చు పెరిగింది. మరోవైపు వాతావరణం సహకరించక దిగుబడి తగ్గిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో రైతుకు పొగాకు రేటు పెంచాలి. కానీ రైతు ఖర్మకాలి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాడు. ఆ దెబ్బకు రేటు దారుణంగా పడి పోయింది. గత ఏడాది కేజీ ధర రూ.366 కాగా, అది పెరగాల్సింది పోయి, కనీసం రూ.200 కూడా సగటు ధర దక్కడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని లేని పక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైసీపీ ఇన్‌ఛార్జి అన్నా వెంకట రాంబాబు, ఒంగోలు పార్లమెంటు అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వై వి సుబ్బారెడ్డి, వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మార్కాపురం మాజీ ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, జంకె వెంకటరెడ్డి, మాజీ మంత్రి మేరుగ నాగార్జున, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుండూరి రవిబాబు, మాజీ పిడిసిసి బ్యాంకు ఛైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి(బన్నీ), జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్సీ తూమాటి మాధవ, ఎమ్మెల్సీ తలసిల రఘురాం, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# వైఎస్ జగన్ పర్యటనలో ఉద్రిక్తత



కార్యకర్తలు తమ చేతుల్లో ఉన్న నీళ్ల బాటిళ్లను నిరసనకారుల పై విసిరారు. ఒకరిద్దరు చేసిన పనికి వైకాపా కార్యకర్తలు ముకుమ్మడిగా రాళ్లు చెప్పులతో నిరసన చేస్తున్న మహిళల పై విసరడంతో వారిలో కొంతమంది గాయపడ్డారు. నిరసన చేస్తున్న తెదేపా కార్యకర్తలు సైతం చెప్పులు విసరడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అక్కడే ఉన్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ దాడిలో తెదేపా కార్యకర్త ముల్లా ఖయ్యూం, ఎ అలేఖ్య, పి నారాయణమ్మ, రాజ్యలక్ష్మి, పోలీసు కానిస్టేబుల్ జి వి రత్నం, మహిళా కానిస్టేబుల్స్ డి క్రాంతికి గాయాలయ్యాయి. జగన్ వెంట భారీగా వైకాపా కార్యకర్తలు, అభిమానులు రావడంతో వారిని అదుపు చేయడం పోలీసులకు సైతం కష్టతరంగా మారింది. పొదిలి సీఐ వెంకటేశ్వర్లు నిరసన చేస్తున్న మహిళలు, తెదేపా కార్యకర్తలను అక్కడి నుంచి పంపించేశారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న తమపై దాడి చేయటం ఏంటని తెదేపా నాయకులు, మహిళలు ప్రశ్నించారు. టీడీపీ నేతలు దాడి చేయడంతో తమ కార్యకర్తలు గాయాలపాలయ్యారని వైసీపీ పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో పోలీసులు నిజనిజాలు తేల్చే పనిలో ఉన్నారు. ఇప్పటికే డ్రోన్ కెమెరాలు, పట్టణంలో ఏర్పాటు చేసిన పలు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.






# మార్కాపురం నియోజకవర్గానికి బ్లాక్ డే







మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటనలో వైసిపి మూకల దాడిలో గాయపడిన క్షతగాత్రులను మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పరామర్శించారు. మొదటిగా పొదిలి పట్టణంలోని షేక్ షేహనాజ్, కంబాలపాడు గ్రామంలోని ఇద్దరు క్షత గాత్రులను, అనంతరం పొదిలి గవర్నమెంట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుకున్న కానిస్టేబుల్ జి వి రత్నంను పరామర్శించారు. తీవ్రంగా గాయపడిన ముల్లా ఖయ్యూంను మెరుగైన చికిత్స కోసం ఒంగోలు పట్టణంలోని వెంకటరమణ హాస్పిటల్‌లో చేర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి బ్లాక్ డే అని అన్నారు. మహిళలను వేశ్యలని అన్న సాక్షి యాజమాన్యానికి వ్యతిరేకంగా మహిళలు శాంతియుతంగా చేస్తున్న నిరసన పై వైసిపి గుండాలు విచక్షణ రహితంగా రాళ్లు, కర్రలు, చెప్పులతో దాడి చేశారన్నారు. కనీసం కొంచమైనా సిగ్గు ఉండాలన్నారు. మేం తలుచుకుంటే జగన్‌రెడ్డి పొదిలి ప్రాంతంలో అడుగుపెట్టే వారే కాదని, అటువంటి సంస్కృతి మా నాయకుడు నారా చంద్రబాబు నాయుడు తమకు నేర్పలేదన్నారు. కనీసం మా నాయకుడిని చూసైనా వైసీపీ నాయకులు బుద్ధి తెచ్చుకోవాలని హితబోధ చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేసే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుందని, అలా నిరసన చేసిన మహిళలను విచక్షణ రహితంగా దాడి చేయడమేనా మీ నాయకుడు మీకు నేర్పిన సంస్కారం అని ఆయన ప్రశ్నించారు. దాడిలో గాయపడిన క్షతగాత్రులకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదిలి మండల నాయకులు మీగడ ఓబుల్‌రెడ్డి, ముల్లా ఖుద్దూస్, ఆవులూరి యలమంద, వరికుంట్ల అనిల్ (పండు), షేక్ గౌస్ భాష, కాటూరి శ్రీను, కనిగిరి జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వరికూటి నాగరాజు, డాక్టర్ సయ్యద్ ఇమాంసా, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పోపూరి నరేష్‌బాబు, తలమల్ల వెంకట్రావు, మూరబోయిన బాబురావు యాదవ్, ముర్వ కాటంరాజు, షేక్ షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ సమస్యలపై వినతిపత్రం అందజేత




(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 11)

రాష్ట్ర ఏపీ డబ్ల్యూజేఎఫ్ తెలుగు మేరకు జర్నలిస్టులు సమస్యలపై ఈ నెల 11వ తేదీనన కనిగిరి తహసీల్దార్‌కు ఏపీ డబ్ల్యూ జెఎఫ్ కనిగిరి శాఖ అధ్యక్ష ,కార్యదర్శులు ఆధ్వర్యంలో సమస్యలపై వినతి పత్రం అందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో అధ్యక్షుడు మస్తాన్ భాష ప్రధాన కార్యదర్శి చెరుకూరి నరసింహారావు (బుజ్జి), సహాయ కార్యదర్శి షేక్ నజీర్ భాష, జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్ వాసు, చెన్నారావు రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌ను జనంలో తిరగనివ్వకూడదనే బాబు సర్కార్ టార్గెట్




రాక్షసంగా వైఎస్ జగన్ కాన్వాయిపై రాళ్ళు రువ్వి, ఉద్రిక్త పరిస్థితిని సృష్టించాలని ప్లాన్ చేశారని వారు మండిపడ్డారు. జెడ్‌ప్లస్ కేటగిరి ఉన్న నాయకుడి పర్యటన సందర్భంగా కాన్వాయికి అతి సమీపంలోకి అరాచకశక్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌ను ప్రజల్లోకి తిరగనివ్వకూడదనే ఏకైక ఎజెండాతో కూటమి ప్రభుత్వం ఎటువంటి అరాచకానికైనా తెగబడుతోందని అన్నారు. ఎంతగా కవ్వించినా వైఎస్ జగన్, పార్టీ శ్రేణులు ధైర్యంగా రైతుల పక్షాన నిలబడ్డారని, పొగాకు కొనుగోళ్ళపై సర్కార్ అలసత్వాన్ని నిలదీశారని అన్నారు. దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ పొదిలి వేలం కేంద్రంలో పొగాకు రైతులను పరామర్శించారు. పొగాకు కొనుగోళ్ళ విషయంలో ప్రభుత్వంను నిలదీశారు. రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ నిలుస్తుందనే భరోసా కల్పించారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మే నాయకుడు వైఎస్ జగన్. అందుకే ఆయన సీఎం అయిన తరువాత రూ.3 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వంలో పొగాకు రైతులు గిట్టుబాటుధర లేక అల్లాడుతుంటే ప్రభుత్వం తరుపున మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించారన్నారు. పొగాకు రైతులకు అండగా ఉంటేందుకు పొదిలి వేలం కేంద్రానికి వస్తుంటే, టీడీపీ మహిళలను అడ్డం పెట్టకుని ఆయన పర్యటనను అడ్డుకునేందుకు ప్రయత్నించిందన్నారు. చెప్పులు, రాళ్ళు విసిరి అరాచకం సృష్టించేందుకు తెగబడ్డారు. రైతుల కోసం వచ్చిన ప్రతిపక్ష నాయకుడిని అడ్డుకోవడం విడ్డూరంగా ఉంది. పొగాకు రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వ వైఫల్యం నుంచి ప్రజల దృష్టిని మళ్ళించాలనే డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే ఈ రకంగా టీడీపీ కుట్రకు పాల్పడింది. ఈ రాష్ట్ర చరిత్రలో వైఎస్సార్ తరువాత మహిళలకు అగ్రస్థానంలో నిలబెట్టిన నాయకుడు వైఎస్ జగన్ అని అన్నారు. రాష్ట్రంలో ఆయన పాలనలో మహిళలకే అధికశాతం పథకాలను అమలు చేశారన్నారు. ఈ రోజు తన ర్యాలీలో కూడా మహిళలను అడ్డం పెట్టుకుని టీడీపీ రాజకీయం చేసేందుకు ప్రయత్నిస్తున్నా, ఆ మహిళలకు నమస్కారం చేస్తూ వెళ్ళిపోయారే తప్ప ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. పొగాకు రైతులకు అండగా నిలిచేందుకు వైఎస్ జగన్ వస్తున్నారనే విషయం, ఆయన పర్యటన గురించి ముందుగానే తెలిసి, ఆయన కార్యక్రమాన్ని ఏదో ఒక విధంగా విఫలం చేయాలనే ఉద్దేశ్యంతోనే టీడీపీ ఈ రకంగా మహిళల ముసుగులో దిగజారుడు రాజకీయం చేసిందన్నారు. పోటీ కార్యక్రమాన్ని నిర్వహించి, రాళ్లు రువ్వడం ద్వారా భయాందోళనలకు గురి చేసిందని ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మండిపడ్డారు. మార్కాపురం టీడీపీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నేతృత్వంలో కుట్ర జరిగిందని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైసీపీ ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు అన్నారు. పొగాకు రైతులకు గిట్టుబాటు రేటు కల్పించాలని, ప్రభుత్వ పరంగా కొనుగోళ్ళు చేయాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయితే వైఎస్ జగన్ పర్యటన సందర్భంగా తెలుగుదేశం పార్టీ మహిళల నిరసనల పేరుతో రాళ్ళు రువ్వుతూ గందరగోళ పరిస్థితులను సృష్టించిందన్నారు. ఈ రాళ్ళ దాడిలో పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, కొందరు పోలీసులకు కూడా గాయాలయ్యాయన్నారు. ఈ దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టీడీపీ ఏదైనా నిరసనలు చేయాలంటే ప్రజాస్వామిక విధానాల్లో, శాంతియుత పద్ధతుల్లో నిర్వహించాలే తప్ప ఈ రకంగా రైతుల గురించి మాట్లాడేందుకు వచ్చిన ప్రతిపక్ష నేత పర్యటన పై రాళ్ళ దాడి చేయడం దారుణమన్నారు. మార్కాపురం టీడీపీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఆధ్వర్యంలోనే కార్యకర్తలను రెచ్చగొట్టి, ఇటువంటి అరాచకానికి ప్రోత్సహించారు. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఆయన పొదిలిలో ఎందుకు తిరిగాడో చెప్పాలని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఒంగోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుండూరి రవిబాబు, సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి మేరుగ నాగార్జున, ఒంగోలు పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, సంతనూతలపాడు మండల వైసీపీ అధ్యక్షులు దుంపా చెంచురెడ్డి, చీమకుర్తి మండల నాయకులు మన్నం శ్రీధర్, బొట్ల సుబ్బారావు, కటారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# మార్కాపురం మున్సిపాలిటీలో అవిశ్వాసం విజయం



ఇప్పటి వరకు మున్సిపాలిటీ చైర్మన్‌గా కొనసాగిన వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత చిర్లంచర్ల బాల మురళీకృష్ణ పదవిని వ్యక్తిగత ప్రయోజనాలకే వినియోగించారు. అభివృద్ధి అనే పదాన్ని మర్చిపోయారు. ప్రజలకు ఉపయోగపడే ఒక్క మంచి పని చేసిన చరిత్ర లేదు అని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మా నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు తెచ్చి, పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించాం. వాటి ఫలితంగా మార్కాపురం మున్సిపాలిటీలో మార్పు కనిపిస్తోంది. ఇవే చర్యలు పలువురు కౌన్సిలర్లను ప్రభావితం చేశాయి. వారు ప్రజల ఆకాంక్షలను ప్రతినిధులుగా వినిపించారు. అందుకే ఈ అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలిపారని కందుల నారాయణరెడ్డి తెలిపారు.



**చంద్రబాబు ఆశీస్సులతో అభివృద్ధి పునఃప్రారంభం**





మా నాయకుడు నారా చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో గత కొద్ది నెలలుగా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తున్నాం. డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, శుభ్రత పథకాలు, వీధి దీపాలు, మంచినీటి సరఫరా వంటి అంశాల్లో ముందడుగు వేసాం. మా పనితీరు చూసి ప్రజలే మాకు మద్దతు ఇచ్చారు అని ఆయన వివరించారు. అవిశ్వాస తీర్మానంలో విజయం సాధించడంలో కౌన్సిలర్ల సహకారం కీలకమైందని పేర్కొంటూ, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ప్రభుత్వ నోటిఫికేషన్ వచ్చిన వెంటనే, టిడిపి బలపరిచిన వ్యక్తిని చైర్మన్‌గా ఎన్నుకుని మార్కాపురం అభివృద్ధికి మరింత దిశానిర్దేశం చేస్తాం. మున్సిపాలిటీలో పారదర్శక పాలన అందించడమే మా ప్రధాన లక్ష్యం అని కందుల నారాయణరెడ్డి స్పష్టం చేశారు.

**రాజకీయంగా మారుతున్న హావాభావాలు:** ఈ అవిశ్వాస తీర్మానం ద్వారా వాయిసిపికి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్టే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. స్థానికంగా వాయిసిపి ప్రభావం తగ్గుతూ, టిడిపి పునరుద్ధరణ దిశగా పయనిస్తోందన్న సంకేతాలు ఈ పరిణామాల ద్వారా బయటపడుతున్నాయి. ఇక ఈ విజయం అనంతరం మార్కాపురం ప్రజల్లో ఆశాజనకమైన వాతావరణం నెలకొంది. వార్డు స్థాయిలో అభివృద్ధి కావాలంటే స్థిరమైన, ప్రజా సేవకు కట్టుబడి ఉండే నాయకత్వం అవసరం. ఇప్పుడు ఆ దిశగా మారుతున్నాం అని పలువురు పట్టణ వాసులు అభిప్రాయపడుతున్నారు.

**నెగ్గిన అవిశ్వాస తీర్మాణం**

**స్పష్టం చేసిన డిఆర్ఓ ఓబులేసు :** మార్కాపురం మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచర్ల బాలమురళి కృష్ణ పై బుధవారం మున్సిపాలిటీలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ ఓబులేసు అధ్యక్షతన కమిషనర్ నారాయణరావు అవిశ్వాస తీర్మానం నిర్వహించారు. మున్సిపాలిటీలో మొత్తం 35 వార్డులు ఉండగా గతంలో ఇందులో వైసీపీ 30 స్థానాలు, టీడీపీ 5 స్థానాలు దక్కించుకుంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారం చేపట్టిన్న తర్వాత వైసీపీ కి చెందిన 11 మంది కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ బలం 17కి పెరిగింది. ఈ సమావేశానికి కౌన్సిలర్లు 35 మందికి 23 మంది హాజరయ్యారు. ఈ ఆవిస్మాన తీర్మానంలో ఛైర్మన్ బాల మురళీకృష్ణ కు వ్యతిరేకంగా 18 టిడిపి కి అనుకూలంగా ఓట్లు వేశారు. వైసీపీకి అనుకూలంగా 5 మంది ఓట్లు వేశారు. దీంతో మార్కాపురం మున్సిపాల్టీ ఛైర్మన్ పదవి టిడిపి కైవసం చేసుకుంది. ఛైర్మన్ పదవికి త్వరలోనే నోటిఫికేషన్ ఇస్తామని డిఆర్ఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, కమిషనర్ నారాయణరావు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు అన్నివేళలా తమ ప్రభుత్వం అండగా ఉంటుంది

## రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి









**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 11)**

రైతులకు అన్నివేళలా తమ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, రాష్ట్ర విద్యుత్ శాఖ గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. జిల్లా వ్యవసాయ శాఖ, పొగాకు బోర్డు ఆధ్వర్యంలో బుధవారం త్రోవగుంటలో వేరువేరుగా నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమాలలో వారు పాల్గొన్నారు. ముందుగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొగాకు వేలం కేంద్రం సమీపంలోని పొలంలో నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన రావు, సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్ కుమార్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్, వైస్ చైర్మన్ బోడపాటి బ్రహ్మయ్య, కార్యదర్శి వేణుగోపాల్, ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కామేపల్లి సీతారామయ్యలతో కలిసి పాల్గొన్నారు. నాగలితో పొలం దున్ని రైతులకు ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి రైతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి ఏరువాక శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలో పొగాకు కొనుగోలు జరుగుతున్న తీరును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ ఒక రైతు బిడ్డగా అన్నదాతల కష్టం తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రి శ్రీ. నారా చంద్రబాబు నాయుడు అని అన్నారు. వ్యవసాయం కోసం ప్రత్యేక బడ్జెట్ ను కూడా తమ ప్రభుత్వమే తీసుకొచ్చిందన్నారు. అన్నం పెట్టే రైతు సంతోషంగా ఉండాలని ముఖ్యమంత్రి కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ దిశగానే అవసరమైన చర్యలను తమ ప్రభుత్వం చేపట్టిందన్నారు. గతంలో రైతులకు వ్యక్తిగతంగా అండగా ఉండేలా రాయితీపై పరికరాలను తమ ప్రభుత్వం అందించింది అన్నారు. నేడు కూడా రాయితీపై వ్యవసాయ పరికరాలను రైతులకు అందించేందుకు 146 కోట్ల రూపాయలను కేటాయించినట్లు చెప్పారు. మ్యాచింగ్ గ్రాండ్స్ లేని కారణంగా గత ప్రభుత్వంలో నిలిచిపోయిన కేంద్ర ప్రభుత్వ పథకాలను కూడా తమ ప్రభుత్వం స్ట్రీమ్ లైన్ చేసిందన్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని ఈ నెల 20వ తేదీన అమలు చేసి రైతులకు ఆర్థిక ప్రయోజనం చేకూర్చుతామని మంత్రి చెప్పారు. ఫ్రీ హోల్డ్ భూముల క్రమబద్ధీకరణ పేరుతో గతంలో జరిగిన తప్పులను తమ ప్రభుత్వం సరిచేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రైతులకు గత ప్రభుత్వం పెట్టిన బకాయిలను కూడా తమ ప్రభుత్వం చెల్లించినట్లు చెప్పారు. పొగాకు సాగు చేస్తున్న రైతులు నష్టపోకుండా తమ ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. లోగ్రేడు పొగాకును కూడా కంపెనీలు కొనుగోలు చేసేలా చూడాలని పొగాకు బోర్డు చైర్మన్ ను మంత్రి కోరారు. ఇప్పటికే మంత్రులతో కూడిన కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. పొగాకుతో పాటు ఇతర పంటలు సాగు చేస్తున్న రైతులెవరూ కూడా నష్టపోకుండా



ధరల స్థిరీకరణ పై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. మంత్రి రవికుమార్ మాట్లాడుతూ గత రెండేళ్లుగా పొగాకు కొనుగోలుదారులు మంచి లాభాలు ఆర్జించారని, ఈ ఏడాది కూడా సాగుచేసిన పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేయాలని అన్నారు. ప్రస్తుతం హై గ్రేడు, మీడియం గ్రేడ్ పొగాకును కొనుగోలు చేస్తున్నారని, లో గ్రేడును కూడా కొనుగోలు చేయాలని ఆయన కోరారు. పొగాకు రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. నల్లబర్లి రకం పొగాకును ఈనెల 16వ తేదీ నుంచి మార్క్ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తమది రైతు ప్రభుత్వం అని, మామిడి, కోకో, ఆయిల్ పామ్ రైతులకు సమస్యలు వస్తే ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆదుకున్నదని చెప్పారు. పొగాకు రైతులకు కూడా దన్నుగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి కూడా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతారని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న సహాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సాంకేతిక పద్ధతులను అమలు చేయడం ద్వారా దిగుబడి పెంచుకోవచ్చని చెప్పారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చటంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందని,



ప్రకృతి సేద్యం విధానానికి కూడా అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు మాట్లాడుతూ రైతులను ఆదుకోవడంలో కంపెనీలు కూడా బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గత ఏడాది మాదిరిగానే ఈసారి కూడా పంట మొత్తాన్ని కొనుగోలు చేయాలని చెప్పారు. అలాగాకుండా కంపెనీలు తమ ఇష్టం వచ్చినట్లు కొనుగోలు చేస్తామంటే సరికాదన్నారు. స్థానిక పరిస్థితులను కంపెనీలు తమ యాజమాన్యాల దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. ఎమ్మెల్యే విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వము, బోర్డు తమను ఆదుకోవడం లేదనే అభిప్రాయంలో పొగాకు రైతులు ఉన్నారని వ్యాఖ్యానించారు. ముందుగా పొగాకు బోర్డు, ఐటిసి అవసరమైన చర్యలు తీసుకొని లోగ్రేడ్ పొగాకు కూడా కొనుగోలు చేసేలా చూడాలన్నారు. పొగాకు బోర్డు చైర్మన్ మాట్లాడుతూ ప్రస్తుతం 60 నుంచి 70 మిలియన్ కేజీల లోగ్రేడ్ పొగాకు ఉన్నట్లు చెప్పారు. బోర్డు ఎల్లప్పుడూ రైతుల పక్షమే ఉంటుందన్నారు. లోగ్రేడ్ పొగాకును కూడా కంపెనీలు కొనుగోలు చేసేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమాలలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ప్రకృతి సేద్యం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, జిల్లా ఉద్యానశాఖ అధికారి గోపీచంద్, మార్క్ఫెడ్ డి.ఎం. హరికృష్ణ, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున్ నాయక్, ఏపీ సి.పి.డి.సి. ఎల్. ఎస్.ఈ. వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ కేసులో రాజీ పడలేదని మరల దాడి చేసిన దేశం

## దుండగులపై మరో ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

## మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య

**(షణ్ముఖ వెలుగు, కొండపి ఇన్‌ఛార్జి, జూన్ 11)**



కోర్టులో విచారణలో ఉన్న ఎస్సీ, ఎస్టీ కేసులో రాజీకి రావాలంటూ మరల దాడి చేసిన టంగుటూరు మండలం పొందూరు అగ్రకుల దుండగులపై మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మరలా బుధవారం మరో ఎస్సీ ,ఎస్టీ కేసు నమోదు చేయించారు. టంగుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పొందూరు గ్రామంలో 2022 సంవత్సరంలో మొండ్రు హనుమంతరావు అనే దళితునికి ఆవుల నరసింహారావు అనే బీసీ కులానికి చెందిన వ్యక్తికి పొలం విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవలో ఆవుల నరసింహారావు అతని బంధువులు మొండ్రు హనుమంతరావు, గుమ్మలంపాటి కోటి నాగులు, కట్టా ఆదినారాయణ అనే దళితులపై దాడి చేశారు. ఈ దాడి విషయమై గ్రామంలోకి వెళ్లిన పైన పేర్కొన్న దళితులపై తెలుగుదేశం పార్టీకి చెందిన పాపినేని వేణు, పమిడి నాగేశ్వరరావు తదితరులు పదిమంది మూకుమ్మడిగా వచ్చి మాలోల్లు ఊర్లోకి వచ్చే ధైర్యం వచ్చిందా అంటూ మార్నాయుదాలతొ దాడి చేశారు. అప్పటిలో ఈ ఘటన 215/2022 ఎస్సీ ఎస్టీ కేసుగా టంగుటూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైనది. అప్పటి దిశా డిఎస్పి విచారణ జరిపి ఛార్జ్ షీట్ కోర్టులో ఫైల్ చేయగా విచారణ జరుగుతూ వాయిదాలు పడు తున్నది. ఈ క్రమంలో ఈ కేసులో రాజీకి రావాలంటూ తమ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గత వైసిపి ప్రభుత్వ హయాంలోనే దాడి చేసిన తమకు ఈ కేసు ఏమీ లెక్కలేదు కాదని కోర్టులో కూడా కేసు తీసేయించుకుంటామని అగ్రకుల తెలుగుదేశం ముద్దాయిలు ఫిర్యాదు దారులందరినీ బెదిరించారు. కానీ క్షతగాత్రుడైన కట్టా ఆదినారాయణ మాత్రం రాజీని వ్యతిరేకించాడు. అందుకు కక్ష కట్టిన అధికార తెలుగుదేశం అండతో అగ్రకుల కండకావరంతో ఈనెల 7వ తేదీ శనివారం రోజు పొందూరు దగ్గర చిన్న ఎల్లమందకుంట వద్ద దారి కాచి కట్ట ఆదినారాయణ కుటుంబం పై మరలా ఎస్సీ, ఎస్టీ కేసులో ముద్దాయిలు బయలుదేగించి దాడి చేశారు. ఆదినారాయణ భార్య కొడుకు కోడలు తదితరులు అందరిపై భౌతికంగా దాడి చేసి కులం పేరుతో దూషిస్తూ అవమానించి కేసు రాజీకి రాకపోతే చంపుతామని బెదిరించారు. ఆదినారాయణ ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్ ను కూడా చేశారు. ఈ ఘటనపై వెంటనే టంగుటూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన స్థానిక టంగుటూరు ఎస్సై కేసు నమోదు చేయలేదు. అంతట బాధితులు తమకు గతంలో అగ్రకులాలు దాడి చేసినప్పుడు న్యాయం చేయించి ఎస్సీ, ఎస్టీ కేసు కట్టించి రక్షణగా నిలిచిన దళిత నేత నీలం నాగేంద్రరావును ఆశ్రయించారు. కట్టా ఆదినారాయణ దళిత కుటుంబంపై దాడి జరిగిన పరిధి దళిత మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి అలాగే షాడో మంత్రి దామచర్ల సత్య పరిధి కావడంతో టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు నిందితుల కులానికి చెందిన వాడు కావటంతో కేసు కట్టలేదు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2015 అమెండ్మెంట్ యాక్ట్ ప్రకారం ఎటువంటి విచారణ లేకుండానే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి. కానీ టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వరరావు పొందూరు గ్రామానికి వెళ్లి బాధితులతో పాటు ముద్దాయిలను కూడా నేరం జరిగిన ప్రాంతానికి పిలిపించి చేసుకోవాలని ముద్దాయిలు నేరం చేయలేదని చెబుతున్నారని బాధితులను బెదిరించే ప్రయత్నం చేశారు. అలాగే ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కేసు అప్పగించిన డి.ఎస్.పి చేయవలసిన ఇన్వెస్టిగేషన్ బాధితులను వీడియో తీస్తూ హంగామా సృష్టించారు. గతంలో ఇదే పోలీస్ స్టేషన్ పరిధిలో కారుమంచి గ్రామంలో దళిత విద్యార్థినిపై లైంగిక వేధింపుల కేసులో కూడా ఉన్నతాధికారులను పక్కదారి పట్టించి తన కులానికి చెందిన ముద్దాయిని రక్షించే ప్రయత్నం చేశారు. దళితుల ఆందోళనతో జిల్లా కలెక్టర్ తమిమ్ అన్సారియా జోక్యంతో కారుమంచి దళిత బాలిక చుక్క పాప కేసులో ఎస్సై కులానికి చెందిన అసలు నిందితులను అరెస్టు చేశారు. ఈ కేసులో కూడా కేసు కట్టకుండా టంగుటూరి ఎస్సై నాగమల్లేశ్వరరావు పోలీసు అధికారు లందరూ తన కులానికి చెందిన వారేనని తాను అవినీతి ఆరోపణలతో బదిలీ అయిన 24 గంటల్లో మరలా ఇదే స్టేషన్‌కు వచ్చాడన్నారు. దళితుల పట్ల టంగుటూరి ఎస్సై పంచాయతీ ఆఫీసు లాగా, లోక దళత్ లాగా రాజీ చేసుకోమన్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో మాల మహానాడు న్యాయపోరాటం చేసి పొందూరుకు చెందిన కట్టా ఆదినారాయణ కేసును 134/2025 ఎస్సీ ఎస్టీ కేసుగా ముద్దాయిలుగా పమిడి వేణు, వేజెండ్ల ప్రసాదు ,పమిడి నాగేశ్వరావులపై కేసు నమోదు చేయించామని మాల మహానాడు అధ్యక్ష కార్యదర్శులు దారా అంజయ్య, కాకుమాను రవి తెలిపారు.

# పొదిలిలో జరిగిన సంఘటన చాలా దురదృష్టకరం

## తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్ల వెంకటరత్నం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 11)**

బుధవారం పొదిలిలో జరిగిన సంఘటన చాలా దురదృష్టకరం అని తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆర్ల వెంకటరత్నం అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పోరుబాటలో భాగంగా పొదిలి లో జరుగు జరుగుతున్న పొగాకు వేలం పాట కేంద్రం వద్దకు విచ్చేసిన సందర్భంగా. అమరావతి రాజధాని మహిళలను తమ సాక్షి పేపర్‌లో అమరావతి మహిళని లు వేశ్యలని రాసినందుకు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలపై వైసీపీ మూకలు రాళ్లు చెప్పులు వేయటం వాళ్ళ వికృతి చాష్టలు నీ మరల చాటుకున్నారు. ఆ సంఘటనలో మెహర్ నిస, షేక్ షహనా బేగం, పోలు దాసు, నారాయణమ్మ, ఆవలూరి అలేఖ్య ఆలెన్ అనే నలుగురు మహిళలకు గాయాలై, ఒక మహిళ కి ముక్కు పగిలి బాగా దెబ్బ తగిలింది. ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తూ జగన్మోహన్ రెడ్డిని కూటమి మహిళలు తరపున ఒకటే ప్రశ్నిస్తున్నామన్నారు. ఇదేనా మీరు మహిళలను గౌరవించే పద్ధతి. మొన్న మీ పేపరు డిబేట్లో, కొమినేని శ్రీనివాసరావు, వి వి. కృష్ణరాజు, నిన్న సజ్జల రామకృష్ణారెడ్డి.. నేడు మీరు. మీ సోషల్ మీడియాలో జగన్ పాదంపెట్టంగానే 90% శాతం పొగాకు బేల్లు అన్ని వేలం పాట జరిగిందని గొప్పలు చెప్పుకున్నారు. మీరు రైతులకు న్యాయం చేయడానికి వచ్చారా, 200 పొగాకు భేళ్ళు నేలమట్టం చేయించడానికి వచ్చారా, కూటమి మహిళా నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# 12,13 తేదీల్లో కనిగిరి బస్ పాస్ కౌంటర్‌కు సెలవులు



**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జూన్ 11)**

నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులుకు బస్ పాస్‌లు ఇవ్వడానికి కొత్తగా సాఫ్ట్‌వేర్ డౌన్లోడ్ చేస్తున్నందున కనిగిరి బస్టాండ్‌లో 12,13 తేదీలలో బస్ పాస్‌లు ఇవ్వబడవని డిపో మేనేజర్ మహమ్మద్ సయనా బేగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరల 14వ తేదీ నుంచి బస్ పాస్‌లు ఇవ్వబడునని తెలిపారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులు, విద్యా సంస్థలు గమనించుకుని శనివారం నుంచి రావాలని కోరారు.

# గుడ్ న్యూస్ బ్లైండ్ స్కూల్లో నిత్యవసర సరుకులు పంపిణీ





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 11)**

సీతారామ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ శాంతమ్మ కుమారుడు మద్దినేని సాయి శ్రీకాంత్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఒంగోలు గుడ్ న్యూస్ బ్లైండ్ స్కూల్లోని విద్యార్థులకు పదివేల రూపాయల విలువ కలిగిన నిత్యవసర వస్తువులు, స్వీట్ హాట్ పంపిణీ జరిగింది. ముందుగా కేక్ కట్ చేసి జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ నూకతోటి శరత్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు ఒంగోలు సిటిజన్ ఫోరం అధ్యక్షులు కొల్లా మధు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మారెళ్ళ సుబ్బారావు మధు మాట్లాడుతూ దాదాపు అరెళ్ల నుంచి సీతారావమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంతోమంది పేద విద్యార్థులకు వృద్ధ కళాకారులకు అనేకమంది బాధితులకు సీతారామమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారని అన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో ఎంతో మందిని ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదుకున్న సంఘటనలు ఉన్నాయని పేర్కొన్నారు. ట్రస్ట్ చైర్మన్ శాంతమ్మ కుమారుడు సాయి శ్రీకాంత్ జన్మదినోత్సవంనాడు ప్రతి ఏడాది ఏదో ఒక మంచిసేవా కార్యక్రమంజరపడం ఆనవాయితీగా వస్తుందని, ఈ రోజు గుడ్ న్యూస్ బ్లైండ్ స్కూలులో నిత్యవసర వస్తువుల సరుకులు పంపిణీ చేయడం సాయి బర్త్డే ఇక్కడ జరుపుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.కుమార్ వరుణ్ కుమార్, గుడ్ న్యూస్ బ్లైండ్ స్కూల్ నిర్వాహకులు మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

# సౌత్ బైపాస్‌లో లయన్ విగ్రహం ఏర్పాటు






**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 11)**

ఒంగోలు నగరం అభివృద్ధిలో భాగంగా సౌత్ బైపాస్ ఒంగోలులోకి వచ్చే ఎంట్రన్స్‌లో 7 లక్షలతో ఫైబర్‌తో ఒంగోలు నగరపాలక సంస్థ ఏర్పాటుచేసిన లయన్ విగ్రహాన్ని ప్రారంభించిన సోషల్ వెల్ఫేర్ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి, ఒంగోలు నియోజకవర్గ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, మాట్లాడుతూ ఒంగోలు నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు దానిలో భాగంగానే ఒంగోలు నగరం అందంగా కనిపించేందుకు ఎంట్రన్స్ లో లయన్ విగ్రహ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కార్పొరేటర్ తిప్పరపల్లి రవితేజ, బండారు మదన్, బోడపాటి వెంకట్, తదితర టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# అధికారంలో ఉన్నప్పుడు జగన్‌రెడ్డికి రైతులు ఎందుకు గుర్తురాలేదు

## ఏరువాక పౌర్ణమి వేడుకల్లో చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, డీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన










**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 11)**

అధికారంలో ఉన్న అయిదేళ్లు మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి పొరపాటున కూడా రైతులు ఎందుకు గుర్తుకు రాలేదు, వారి కష్టనష్టాలు ఎందుకు పట్టలేదని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రశ్నించారు. రూ.1674 కోట్ల ధాన్యం బకాయిలు ఎగ్గొట్టినప్పుడు గాని, మిర్చి, పొగాకు రైతులు గిట్టుబాటు ధరల్లేక అవస్థలు పడినప్పుడు గానీ జాడలేని, పంటల బీమా పథకం అమలు చేయని వ్యక్తి ఇప్పుడు రైతుల పేరుతో మొసలి కన్నీళ్లు కార్చుతున్నారని మండి పడ్డారు. ఇదే వ్యక్తి అయిదేళ్లలో ఎప్పుడైనా రైతుల్ని ఆదుకున్నారా అని తూర్పారాబట్టారు. వినుకొండ నియోజ కవర్గం ఈపూరులో ఏరువాక పౌర్ణమి వేడుకల్లో బుధవారం ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఎద్దులను పూజించి నాగలితో దుక్కి దున్ని వ్యవసాయ పనులు ప్రారంభించారు. అనంతరం మాట్లాడిన ఆయన ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 80% తొలిఏడాది లోనే అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది అన్నారు. పెరిగిన పింఛన్లు, అమల్లోకి రాను న్న అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం పథకాలే అందుకు నిదర్శన మని తెలిపారు. దీపం-2 కింద ఏడాదికి 3 ఉచితగ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని, మహిళలకు ఉచితబస్సు ప్రయాణం త్వరలోనే అమల్లోకి రానుందన్నారు. గత తెదేపా హయాంలో రాయితీ పై పెద్దఎత్తున వ్యవసాయ పరికరాలు ఇచ్చామని, వాటిని కూడా ఐదేళు ఎందుకు ఎగ్గొట్టారో సమాధానం చెప్పాలన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జగన్ వెన్ను పోటు దినమని మాట్లాడటానికి సిగ్గుండాలని, నిజానికి అతడే ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 90శా తం ఎగ్గొట్టి రైతులు, ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. అందుకే 94% స్థానాల్లో ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించారన్నారు. ప్రస్తుతం పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును పూర్తి చేయాలనే మహా సంకల్పంతో సీఎం చంద్రబాబు ముందుకెళ్తున్నారని, అది పూర్తయితే పల్నాడుకే తొలిలబ్ధి కలుగుతుందని, ఒక సీజన్ గోదావరి, మరో సీజన్ కృష్ణా జలాలతో 2 పంటలు పండించుకోవచ్చని తెలిపారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాలతో పాటు రాయలసీమలో ఆయకట్టు పెరుగుతుందన్నారు. తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రూ.12,903 కోట్లు కేటాయించిందన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారని చెప్పారు. 6 లక్షలమందికి భూసార పరీక్షలు చేసి కార్డులు అందిస్తున్నామని, వైసీపీ పాలనలో ఎప్పుడైనా భూసార పరీక్షలు చేశారా అని ప్రశ్నించారు. పల్నాడు జిల్లాలో 67 వేలమందికి కౌలు రైతు కార్డులు అందించబోతున్నామని తెలిపారు. ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తూ భూమిని, సాగును, రైతుల్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అధైర్య పడద్దు.. నేను ఉన్నా

## జిల్లా కలెక్టర్ వెంకటమురళి
## చీరాల యువకుడికి భరోసా ఇచ్చిన కలెక్టర్
## పీ 4 కింద దత్తతకు తీసుకున్న డిఆర్డిఏ
## రూ.50 వేలు ఆర్థిక సహాయం అందించిన జిల్లా కలెక్టర్

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, బాపట్ల, జూన్ 11)**





ఆమె గ్రామ సమాఖ్య సహాయకురాలుగా పనిచేస్తుంది.. ఆమెకు ఒక్కడే అయిన కుమారుడు.. భర్త వదిలేయడంతో ఒంటరి మహిళగా జీవితం సాగిస్తోంది. ఇటీవల ఆమె అనారోగ్యంతో మృతి చెందింది. ఇప్పటి వరకు ఆ కుమారుడుకి సర్వం తానై నిలిచింది. ఆమె మృతితో కొడుకు జీవితం అంధకారం మయమైంది. బాపట్ల జిల్లా చీరాల మండలం హస్తినాపురం గ్రామానికి చెందిన పముజుల వెంకటశిరీష గ్రామ సమాఖ్య సహాయకురాలుగా పని చేస్తూ జీవనం సాగిస్తుంది. భర్త వదిలేయడంతో కుమారుడే లోకమని భావించి అతని కోసం కొన్నేళ్లుగా ఒంటరి జీవితం కొనసాగిస్తోంది. ఇటీవల ఆమె అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఈమెకు ఒక్కడే అయి ఉన్న కుమారుడు పవన్ నిశ్చేస్తుడిగా మిగిలి పోయాడు. తల్లి మృతితో పవన్ ఏకాకిగా మిగిలాడు. పవన్ బాపట్లలోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో ఫోర్త్ ఇయర్ చదువుతున్నాడు. ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆశించిన తన కలలన్నీ నిరాశలయ్యాయి. అలాంటి సమయంలో పవన్ కు డిఆర్డిఏ బాసటగా నిలిచింది. పవన్ ఉన్నత చదవులకోసం చేయూతనందించాలని నిర్ణయించింది. వెనువెంటనే పీ4 కింద దత్తతకు తీసుకుంది. చీరాలకు చెందిన గ్రామ సమాఖ్య సభ్యులంతా కలిసి అతనికి తమ వంతు సహాయంగా రూ.50 వేలను జిల్లా కలెక్టర్ వెంకటమురళి అందజేశారు.

**భుజం తట్టి నిలిచిన కలెక్టర్...** యువకుడు పవన్ గురించి తెలుసుకున్న కలెక్టర్ స్పందించారు. ఎప్పుడైనా ఎటువంటి కష్టం వచ్చినా తనను కలవవచ్చని కలెక్టర్ వెంకటమురళి భరోసా ఇచ్చారు. జిల్లాలో మొట్ట మొదటి సారిగా యువకుడ్ని డిఆర్డిఏ దత్తతకు తీసుకోవడంపై డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావును, సిబ్బందిని జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

# గత పదేళ్లుగా పనిముట్లు ఇవ్వని ప్రభుత్వం



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జూన్ 11)**

ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న గ్రామీణ కార్మికులకు గత పదేళ్ల కాలంలో ఒక్క పని ముట్టు కూడా ఇవ్వలేదని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు ఆరోపించారు. హనుమంతునిపాడు మండలంలోని ముప్పల్లపాడు గ్రామంలో ఉపాధి కూలీలు పని ప్రదేశంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మీరు మాట్లాడుతూ పనిముట్లు ఇవ్వకుండా పని ఎలా చేయాలని ప్రశ్నించారు గతంలో ప్రభుత్వం బాడుగలు ఇచ్చేదని ప్రస్తుతం పనిముట్ల బాడుగలు ఆపేశారని ప్రభుత్వం పనిముట్లు ఇవ్వకుండా బాడుగలు ఇవ్వకుండా పనిచేయటం సాధ్యమేనా ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. గతంలో ప్రతి శ్రమ శక్తి సంఘానికి గడ్డపార సెలక పారా తట్టలు, బుట్టలు గడ్డపారను సానా పట్టుకోవడానికి కొలిమిక అయ్యే ఖర్చు సైతం ఇచ్చేవారని గుర్తు చేశారు. పనిముట్లు పంపిణీ చేయడం వలన కూలీలు పని మెజర్మెంట్స్ తగ్గకుండా పని చేశారని తెలిపారు. పనిముట్లు ఇవ్వరు మంచినీళ్లు మజ్జిగ ఇవ్వరు సమ్మర్ అలవెన్స్ ఇవ్వరు ఆటో బాడుగలు ఇవ్వరు మొత్తంగా ఉపాధిలో పనిచేసేటువంటి కార్మికులకు ప్రభుత్వం పంగనామాలు పెట్టే కార్యాచరణ హెద్దేవ చేశారు. గత మూడు నెలల కాలంలో ఒక్క బిల్లు కూడా నేటికీ చెల్లించలేదని తక్షణమే ఉపాధి పెండింగ్ బిల్లులను విడుదల చేసి కూలీలకు అకౌంట్లో డబ్బులు వేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేకల గురుస్వామి సూరెడ్డి ,వెంకటరెడ్డి,మోషే, ఇజ్రాయిల్ ,కొండయ్య తోపాటు ఉపాధి కూలీలు మెట్లు పాల్గొన్నారు.

# అమరావతి మహిళల అవమానం కేసులో ఎస్సీ, ఎస్టీ కేసును దుర్వినియోగం చేసిన చంద్రబాబు

## దళిత నేత నీలం నాగేంద్రరావు డిమాండ్

**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 11)**




అమరావతి మహిళలను అవమానించారంటూ జర్నలిస్టులు కృష్ణంరాజు, కామినేని శ్రీనివాసరావులపై నమోదైన కేసులో ఎస్సీ,ఎస్టీ యాక్టివేయటం చంద్రబాబు అధికార దుర్వినియోగానికి నిదర్శనమని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నేలం నాగేంద్రరావు మండిపడ్డారు. బుధవారం స్థానిక సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో నీలం నాగేంద్రరావు మాట్లాడుతూ తెనాలిలో దళిత యువకులపై జరిగిన బహిరంగ పోలీసు దాడి ఘటనలో నేరానికి కులం మతం ఉండదన్న హెూం మంత్రి అనిత అమరావతి ఘటనలో మహిళలను అవమానించారంటూ ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేయించడంపై అందించాలన్నారు. అమరావతి ప్రాంత మహిళలు వేశ్యలు అంటూ డిబేట్ ఛానల్లో మాట్లాడిన వారిపై సాధారణ బీఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేయలే కానీ ఎస్సీ,ఎస్టీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేయటం కూటమి ప్రభుత్వ కూటిలత్వానికి నిదర్శనమన్నారు. కంభంపాటి శిరీష అనే ఎస్సీ మాదిగ కులానికి చెందిన మహిళతో ఫిర్యాదు చేయించి కుల ప్రస్తావన లేని అమరావతి మహిళల అవమానం కేసులో ఎస్సీ,ఎస్టీ యాక్ట్ వేయించడం చంద్రబాబు ప్రభుత్వ ఎస్సీ ఎస్టీ అధికార దుర్వినియోగానికి నిదర్శనం అన్నారు. అలాగే అమరావతి సంకరజాతి అంటూ వైసీపీ ప్రతినిధి సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలపై సంకరజాతిలో ఎస్సీ, ఎస్టీలు ఉన్నారంటూ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఎస్సీ ,ఎస్టీ కేసు నమోదు చేయమని డిజిపికి ఫిర్యాదు చేయడం హాస్యాస్పదమన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో నిజమైన ఎస్సీ ఎస్టీ బాధితులకు న్యాయం జరగటం లేదన్నారు. ఎస్సీ ఎస్టీ కేసులు నమోదు చేయడం లేదన్నారు. ఎస్సీ ,ఎస్టీ కేసుల బాధితులపై కౌంటర్ కేసులు పెడుతున్నారు అన్నారు. ఎస్సీ ఎస్టీ ఫిర్యాదులపై ఎటువంటి విచారణ చేయకుండా ఎస్సీ ఎస్టీ కేసులు కట్టాలని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఎస్సీ ఎస్టీ అమైన్మెంట్ యాక్ట్ వచ్చినా కానీ కూటమి ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ యాక్ట్ కు తూట్లు పడుతుందన్నారు. గతంలో ఎస్సీ,ఎస్టీ యాక్టివ్ అమలుకు ప్రతి జిల్లాకు ఇద్దరు డిఎస్పీలు ఉండేవారని ప్రస్తుతం ఒక జిల్లాకు ఒక డిఎస్పి కూడా లేదు అన్నారు. ఎస్సీ ఎస్టీ కేసులను డిఎస్పి విచారించాల్సి ఉంటే స్థానిక ఎస్సైలు వీడియోలు తీస్తూ ఎస్సీ,ఎస్టీ ఫిర్యాదుదారుల్ని రాజీ చేసుకోమని బెదిరిస్తున్నారు. తెనాలి దళిత యువకులపై పోలీసు దాడి ఘటనలో నేరాలకు కులం ఉండదని మాట్లాడిన రాజ్యాంగ నిపుణురాలు హెూం మంత్రి అనిత అమరావతి మహిళల అవమాన ఘటనలో దళిత మహిళ కంభంపాటి శిరీషచే ఫిర్యాదు చేయించి సీనియర్ జర్నలిస్టులకు బెయిల్ రాకుండా ఎస్సీ,ఎస్టీ కేసు కట్టించడం ఎంతవరకు న్యాయమన్నారు. జిల్లా జడ్జి సురేష్ బాబు విచారణ జరిపి ఈ ఘటనలో ఎస్సీ, ఎస్టీ కేసు వర్తించదని ఎన్నిసార్లు చెప్పినా మరలా ఎందుకు ఎస్సీ ,ఎస్టీ కేసు వేశారని సదరు డీఎస్పీని జిల్లా ఎస్పీని మందలించిన విషయాన్ని ఎస్సీ, ఎస్టీ యాక్ట్ తీసివేయించిన వైనాన్ని హెూం మంత్రి అనిత గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య , మాలపోలు శాంత కుమార్, ఎర్ర మౌతు ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

## తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన ఎపిడబ్ల్యుజెఎఫ్ ప్రతినిధులు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జూన్ 11)**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పొదిలి మండల తహశీల్దార్ ఎం వి కృష్ణారెడ్డికి బుధవారం ఏపీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఆధ్వర్యంలో పొదిలి తాసిల్దార్ ఎం వి కృష్ణారెడ్డి కి వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టులకు అవార్డులు, ఆరోగ్య బీమా, రద్దయిన కార్మిక చట్టాలను పునరుద్ధరించడం వంటి అంశాల పై చర్యలు తీసుకొవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఓబులశెట్టి రాధాక్రిష్ణ, సభ్యులు ముల్లా హాసన్ వలి (బడే), వడ్డే వేణు, యన్ వెంకటేశ్వర్‌రెడ్డి, రామకోటిరెడ్డి, అహ్మద్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# వినుకొండను ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దడమే ఏకైక లక్ష్యం

## శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 5 బస్ షెల్టర్ల నిర్మాణానికి శ్రీకారం

## బస్ షెల్టర్లు, వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణ పనులకు చీఫ్ విప్ జీవీ శంకుస్థాపన

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జూన్ 11)





కూటమి ప్రభుత్వం ఈ దఫా అధికారంలోకి వచ్చింది మొదలు రాష్ట్రంలోనే వినుకొండను ఆధునిక పట్టణంగా, గ్రేటర్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. రోడ్లు, డ్రెయిన్లు, మంచినీటి సౌకర్యాలు, మైదానాలు, బస్‌షెల్టర్లు, కొండపై రామలింగేశ్వరస్వామి ఆలయం అభివృద్ధి, ఘాట్‌రోడ్ నిర్మాణం, వ్యాయామ సదుపాయాలు అన్నింటిలో కనిపిస్తున్న పురోగతే అందుకు నిదర్శనమన్నారు. వినుకొండ జూనియర్ కళాశాల, ఎన్నెస్పీ మైదానంలో వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణ పనులకు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు శంకుస్థాపన చేశారు. శివశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినుకొండ పట్టణంలో 5 చోట్ల ఆధునిక బస్ షెల్టర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కారంపూడి రోడ్‌లో బస్ షెల్టర్ నిర్మాణానికి జీవీ ఆంజనేయులు శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడిన ఆయన యోగా, వ్యాయామం ఆరోగ్యానికి, ఆహ్లాదకరానికి చాలా అవసరమన్నారు. అందుకోసమే వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు ఓపెన్ జిమ్ ఆధునీకరిస్తున్నామని తెలిపారు. గత తెదేపా పాలనలోనే ఈ వాకింగ్ ట్రాక్‌ను వేశామని, ఐదేళ్ల వైసీపీ పాలనలో కనీసం తట్టమట్టి పోయలేదని, వారి నిర్లక్ష్యంతో ట్రాక్ మొత్తం దెబ్బతిందని మండిపడ్డారు. ఇప్పుడు కొత్తట్రాక్‌కు నిధులతో పాటు జిమ్ పరికరాలకు మరమ్మతులు చేపట్టి ఆధునికంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఎన్నెస్పీ మైదానంలో మరో వాకింగ్ ట్రాక్ కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. వర్షాకాలం నేపథ్యంలో నాలాలు, మురుగుకాల్వలలపై దృష్టి పెట్టామని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా పెద్ద డ్రైన్లను ప్రతి రహదారిలో నిర్మిస్తున్నామన్నారు. గ్రామాలు, పల్లెల నుంచి వచ్చిన ప్రజలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారని, సాధారణ ప్రజలతో పాటు విద్యార్థులకు ఉపయోగపడేలా శివశక్తి ఫౌండేషన్ ద్వారా పట్టణంలో 5 బస్ షెల్టర్లు నిర్మిస్తున్నామని తెలిపారు. అందుకోసం మున్సిపల్ కమిటీ తీర్మానం చేసినందుకు అభినందన లు తెలిపారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ సహకారంతో తాగునీటి పథకం కోసం రూ. 210 కోట్ల నిధులు తీసుకొచ్చామని, త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో తాగునీటి పథకం పనులను 2% కూడా చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. పట్టణంలో ఒక్క మరుగుదొడ్డి కూడా కట్టలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పట్టణంలో మోడరన్ మరుగుదొడ్లతో పాటు బస్ షెల్టర్ల నిర్మాణం చేపట్టామని అన్నారు. రామలింగేశ్వరస్వామి ఘాట్ రోడ్ నిర్మాణానికి కూడా నిధులు తెచ్చామన్నారు. మురుగునీటిని శుద్ధికి రూ.18 కోట్లతో 2మురుగునీటి శుద్ధి కేంద్రాలు తీసుకొచ్చామన్నారు. వినుకొండ పట్టణాన్ని పరిశుభ్రత, పచ్చదనంతో తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

## మంత్రులు గొట్టిపాటి, డిబివి స్వామికి ఎపిడబ్ల్యుజెఎఫ్ వినతి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 11)



రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు గతంలో ఇచ్చిన హామీలు, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామిని ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా కమిటీ నేతలు కోరారు. ఒంగోలు త్రోవగుంట పొగాకు కేంద్రంలో ఏరువాక పూర్ణిమలో పాల్గొన్న మంత్రులను ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా నాయకులు బుధవారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా మాజీ అధ్యక్షులు గొట్టిపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టుల ఇళ్ళ స్థలాల సమస్య అపరిష్కృతంగా ఉందని, ప్రభుత్వం 3 సెంట్లు ఇస్తామని గతంలో జీవో జారీ చేసిందన్నారు. అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని కోరారు. జర్నలిస్టుల ఉద్యోగ భద్రత, పని దినాలు, ఇతర సదుపాయాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు పెన్షన్ పథకాన్ని అమలు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. అక్రిడిటేషన్ కమిటీలో ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఏలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. జర్నలిస్టులపై దాడులను అరికట్టేందుకు వీలుగా రాష్ట్ర హెూం శాఖ ఆధ్వర్యంలో హైపవర్ కమిటీ, జిల్లాలో పోలీస్ ఉన్నతాధికారులతో కమిటీలు వేయాలన్నారు. మీడియా అకాడమీ బలోపేతం చేసేందుకు ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఏలకు ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. వర్కింగ్ జర్నలిస్ట్ చట్టంతో పాటు ఇతర కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ జర్నలిస్టులు, ఇతర సిబ్బందిని అక్రమంగా తొలగిస్తున్న యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు కార్మికశాఖ ఆదేశించాలని కోరారు. జర్నలిస్టులకు అవార్డులు, ఆరోగ్య బీమా, రద్దయిన కార్మిక చట్టాలను పునరుద్ధరించడం వంటి అంశాలపై చర్యలు తీసుకొవాలని కోరారు. స్పందించిన మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డిబివి స్వామి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని "హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ కె చిన కరిముల్లా, దాసరి సునీల్, పి 9 టివి మేనేజింగ్ డైరెక్టర్ పి కిరణ్ కుమార్, ఎల్ రాజు పాల్గొన్నారు.



# అమరావతి మహిళల పై దురుసుగా మాట్లాడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

## కందుకూరు నియోజకవర్గ జనసేన నేతలు



(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 11)

పవన్ కల్యాణ్ ఆశయాలు జనసేన పార్టీ సిద్ధాంతాలు కొనసాగేలా ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన అధ్యక్షుడు షేక్ రియాజ్ ఆదేశాలు మేరకు కందుకూరు నియోజకవర్గ జనసేన నాయకులు దేవళ్ళ భాస్కర్ రావు సూచనలు మేరకు ఇటీవల సాక్షి చానెల్ లో అమరావతి మహిళలు పట్ల అనుచితంగా మాట్లాడిన కృష్ణంరాజు మరియు సాక్షి చానెల్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావుల చర్యలను కందుకూరు నియోజకవర్గ జనసేన పార్టీ తరపున ఖండిస్తున్నామని జిల్లా కార్యక్రమాల కార్యదర్శి కొణిదెన శ్రీనివాసులు ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంతో చారిత్రక ప్రాధాన్యత గల ప్రాంతమైన అమరావతిని రాష్ట్ర రాజధానిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి ముందుకు తీసుకు వెళ్తున్నాయి. ఈ సందర్భంగా రాజధాని ప్రాంతంగా అమరావతిలో అనేక పరిశ్రమలు ఏర్పాటు జరిగి అభివృద్ధి చెందితే ఆ క్రెడిట్ అంతా కూటమి ప్రభుత్వానికి వస్తుందేమో అనే అక్కసుతో కొన్ని రాజకీయ పార్టీలు కృష్ణంరాజు వంటి మేధావులు గా చెప్పుకునే అనలిస్ట్ అమరావతి ప్రాంతాన్ని దేవతల రాజధాని కాదు వేశ్యల రాజధానిగా మరియు అమరావతి చుట్టుపక్కల సెక్స్ వర్కర్లు ఎక్కువగా ఉన్నారని సాక్షి చానెల్ లో మాట్లాడుతుంటే ఆ చానల్ యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావు ఆ వ్యాఖ్యలు ఖండించక పోగా వాటిని సమర్థిస్తూ ఎంకరేజ్ చేసిన వైనం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. అంతేకాకుండా సదరు చానల్ వారు పై వ్యాఖ్యల ఖండించక పోగా విస్తృతంగా ప్రసారం చేయడమే కాకుండా "చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా.. ఆ వ్యాఖ్యలు మా చానల్ కి సంబంధం లేదు సదరు అనలిస్ట్ కి మాత్రమే చెందినవి అని చెపుతున్నారు. ఈ వ్యాఖ్యలతో మహిళలు ఆక్రోశం చెంది మహిళా సంఘాలు ద్వారా ఉద్యమాలు చేపట్టినప్పటికీ కనీస ధర్మం గా క్షమాపణలు చెప్పక పోగా మా తప్పేముంది అని ట్వీట్ చేస్తున్నారు. అమరావతి అభివృద్ధి చెందితే వారి రాజకీయ భవితవ్యం కుడితిలో పడిన ఎలుక పరిస్థితి అవుతుందని తప్పులో తప్పు చేస్తున్నారు. ఇలాంటి చర్యలు దుర్మార్గం. మహిళలను గౌరవించని చోట ప్రగతి శూన్యం. పురాణ కాలం నుంచి చారిత్రక నేపథ్యం వరకు బౌద్ధ జైన కాలం నుంచి నేటి కూటమి ప్రభుత్వం వరకు అమరావతి ప్రాంతం మహెూన్నత మైనదని ఈ అంశం ప్రతి ఒక్కరూ ఒప్పుకొని తీరాల్సిందే అని జనసేన జిల్లా కార్యక్రమాల కార్యదర్శి శ్రీనివాసులు నొక్కి వక్కాణించారు. మహిళలను గౌరవించని వారు మరియు వారిని అబలలు గా భావించి జుగుప్సాకరమైన వ్యాఖ్యలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకునే విధంగా చట్టాలు రూపొందించడానికి ప్రజలు సహకరించాలని శ్రీనివాసులు కోరారు.

# ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి

## రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 11)



వైద్య ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి చెప్పారు. ఒంగోలులోని ప్రభుత్వ సమగ్ర వైద్యశాల(జి.జి.హెచ్)లో నూతనంగా ఏర్పాటుచేసిన తల్లి, నవజాత శిశు సంరక్షణ విభాగాన్ని (ఎం.ఎన్.సి.యు) జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు, ఒంగోలు మేయర్ గంగాడ సుజాతలతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కంగారు మదర్ కేర్ విధానాన్ని కనిగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో మన జిల్లాలో మొదటిసారిగా అమల్లోకి తెచ్చామన్నారు. అలాంటి సేవలు కలెక్టర్ ఆలోచన, స్థానిక ఎమ్మెల్యే సహకారంతో ఒంగోలు జి. జి.హెచ్.లో కూడా అందుబాటులోకి వచ్చాయన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. ప్రస్తుతం ప్రారంభించిన ఈ విభాగమే దానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఒంగోలులోని మాతా శిశు వైద్యశాల (ఎం.సి.హెచ్) లో కూడా ఇలాంటి సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఈ సందర్భంగా కలెక్టరుకు సూచించారు. తద్వారా ఒంగోలులో శిశు మరణాలను సాధ్యమైనంతవరకు తగ్గించవచ్చని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు చెప్పారు. ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బరువు తక్కువగా పుట్టిన బిడ్డలకు అత్యవసర వైద్య సేవలు అందించేలా, అదేవిధంగా తల్లితో బిడ్డకు అవసరమైన భౌతిక సంబంధం ఉండేలా కంగారు మదర్ కేర్ విభాగాన్ని ఒంగోలు జి.జి.హెచ్‌లో అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రభుత్వ ఆలోచనలు, ఆశయ స్ఫూర్తితో వైద్య సిబ్బంది కూడా పనిచేయాలని ఆయన సూచించారు. ప్రజలకు అవసరమైన అన్ని సదుపాయాలను జి.జి.హెచ్‌లో అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఇంచార్జ్ సూపరింటెండెంట్ , మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఏడుకొండలు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ ప్రభాకర్‌రావు, అడ్మినిస్ట్రేటర్ అద్దయ్య, కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాలరావు, డిప్యూటీ సిఎస్ఆర్ఎంఓ డాక్టర్ చెంచయ్య, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ హేమంత్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శ్రావ్య, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.






# నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

## చేపట్టిన ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు








**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జూన్ 11)**

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా ఒంగోలు నియోజకవర్గంలో వరకు పూర్తయిన పనులకు ప్రారంభోత్సవాలు చేపట్టడం జరిగింది. నియోజకవర్గం మొత్తం మీద జరిగిన పనులు 375 పనులకు గాను 124 కోట్ల పనులకు ప్రారంభోత్సవాలు చేపట్టడం జరిగింది. అందులో భాగంగా ఒంగోలు నగరం నందు 5 అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగింది. కొత్తపట్నం మండలం రంగాయిపాలెం నందు 90 లక్షలతో నిర్మించిన 20 సీసీ రోడ్లు, డ్రైన్లు ప్రారంభించారు. ఒంగోలు మండలం యరజర్ల గ్రామం నందు 1.10 కోట్లతో నిర్మించిన 26 సీసీ రోడ్లు మరియు డ్రైన్లు ప్రారంభించడం జరిగినది. మిగతా చోట్ల మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్ని ప్రారంభించడం జరిగింది.

# నూతన సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలో సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ





**(షణ్ముఖ వెలుగు, కందుకూరు, జూన్ 11)**

కందుకూరు పట్టణంలోని కోవూరు రోడ్ లో నూతనంగా నిర్మించిన 18.03 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సి.సి రోడ్ మరియు డ్రైన్ మంగళవారం సాయంత్రం కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందు చూపుతో స్వర్ణాంధ్ర 2047 ముందుకెళ్తున్నారని తెలిపారు.. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజల భాగస్వామి చాలా అవసరమని, ప్రజలందరూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర విజన్ 2047 సహకరించాలని, కందుకూరు నియోజకవర్గం అభివృద్ధికి మీ విలువైన సూచనలను సలహాలను ప్రభుత్వానికి అందించవచ్చునని సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ గారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే అనుష, పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు పిడికిడి వెంకటేశ్వర్లు, చదలవాడ కొండయ్య, ముచ్చు శ్రీనివాసరావు, చిలకపాటి మధుబాబు, బెజవాడ ప్రసాద్, షేక్ మున్నా, గడ్డం మాలకొండయ్య, సవిడిబోయిన వెంకటకృష్ణ, మంచిరాజు మురళి మోహన్, కొత్తూరి వెంకట సుధాకర్ వార్డు అధ్యక్షుడు ముప్పవరపు వేణు, గుమ్మ శివ, పీలా శ్రీనివాసరావు, పొడపాటి మాధవ, కొమర రమణయ్య, ఓరుగంటి రామ్మూర్తి, చల్లా మహేంద్ర, బత్తిన ఆదెమ్మ, మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి

## రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి





**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, జూన్ 11)**

రాష్ట్ర ప్రభుత్వం మాతా శిశు వైద్యంపై ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. కనిగిరిలోని కమ్యూనిటి హెల్త్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కంగారు మదర్ కేర్ సెంటర్ (మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్) ను బుధవారం జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డితో కలిసి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేతో కలిసి వైద్యాధికారులతో సమావేశమై ప్రజలకు వైద్యసేవలు అందించడంలో దిశానిర్దేశం చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్య సేవల పట్ల ఎవరు నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ రోజు కనిగిరి కమ్యూనిటి హెల్త్ సెంటర్ లో మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్‌ను ప్రారంభించుకోవడం సంతోషదాకమన్నారు. ఈ యూనిట్ ను ప్రారంభించుకోవడంలో ఇద్దరిని మనమంతా ప్రత్యేకంగా అభినందించుకోవలసిన అవసరం ఉందన్నారు. ఆలోచన చేసిన జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా వారిని, ఆలోచనను ఆచరణలో పెట్టిన ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డిని అని అన్నారు. దాతల సహకారంతో, తన సొంత నిధులు వెచ్చించి తన సొంత అమరావతి ఆసుపత్రి కన్నా మెరుగ్గా ఈ మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ ను ఏర్పాటు చేసినందుకు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించుకోవలసిన అవసరం ఉందన్నారు. వీరితో పాటుగా లక్నో నుంచి వచ్చి ఈ మదర్ కేర్ యూనిట్ అమలు తీరును పర్యవేక్షిస్తున్న కమ్యూనిటీ ఎంపవర్మెంట్ ప్రతినిధులను కూడా అభినందిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ఈ మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్‌లో ఎమ్మెల్యే తన సొంత నిధులతో ఆరు మంది సిస్టర్స్ ను కూడా నియ మించడం అభినందనీయమన్నారు. పుట్టిన ప్రతి బిడ్డ కు మెరుగై న వైద్యం అందచేయడం, పుట్టిన బిడ్డ పూర్తి స్థాయిలో ఆరోగ్యవంతంగా ఉండాలన్నదే ఈ మదర్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ ప్రధాన ఉద్దేశం అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా మాతా శిశు వైద్యం పట్ల, ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలు కూడా అనవసరం ఖర్చులకు పోకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొంది ఆర్థికంగా వెసులుబాటు పొందాలని మంత్రి ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ



కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర రావు, డిసి హెచ్ ఎస్ డాక్టర్ శ్రీనివాసనాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట సుబ్బయ్య, ఆసుపత్రి వైద్యులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com

# మాజీ సీఎం వైఎస్ జగన్ పొదిలి పర్యటన దృశ్యమాలిక























